# తెలుగురాష్ట్రం

APTEL/2016/66202

తెలుగు దినపత్రిక

అమలాపురం | సంపుటి : 10 సంచిక : 56 | ఎడిటర్ : ఎ. రాజశేఖర్ | గురువారం 17 ఏప్రిల్ 2025 | పేజీలు 8 వెల : 5/-

published : Amalapuram Vol:10 Issue : 56 17-04-2025 Editor : A.RAJASEKHAR Pages : 8 Rs: 5/-



అమరావతికి రూ. 47,000 కోట్లు అవసరం
సీఎం చంద్రబాబు

- మిగతా 2 లో..

## మూడు సిటీలు కలిపి
# మెగా సిటీ..

## చంద్రబాబు మాస్టర్ ప్లాన్

**అమరావతి ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ఏపీలో అతి పెద్ద సిటీ రానుంది. అమరావతి, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ అన్నీ కలిపి మెగా సిటీగా రానుంది. దీనికి సంబంధించి సీఎం చంద్రబాబు మాస్టర్ ప్లాన్ రూపొందించారని మంత్రి నారాయణ స్వయంగా తెలిపారు. ఆంధ్రప్రదేశ్ ను మునుపెన్నడూ లేని విధంగా అభివృద్ధి చేసేందుకు సీఎం చంద్రబాబు నాయుడు సంకల్పించారు. ఇప్పటికే రాష్ట్రానికి ఎన్నో కొత్త ప్రాజెక్టును, పరిశ్రమలను తీసుకువస్తున్నారు. దానికి తోడు ఇప్పుడు తాజాగా ఓ మాస్టర్ ప్లాన్ ను సిద్ధం చేశారని పురపాలక మంత్రి పి. నారాయణ చెబుతున్నారు. అదే మెగా సిటీ అని తెలిపారు. అమరావతి, గుంటూరు, మంగళగిరి, తాడేపల్లి, విజయవాడ వీట్నింటినీ కలిపి ఒకే సిటీగా తయారు చేయాలని సీఎం చంద్రబాబు అనుకుంటున్నారు. మెగాసిటీకి ఒక అంతర్జాతీయ విమానాశ్రయాన్ని కూడా ఏర్పాటు చేయాలని భావిస్తున్నారు. దాని కోసం 5 వేల ఎకరాలు కావాలని, ఆ మేరకు భూమి పరిశీలించాలని చంద్రబాబు ఆదేశించినట్లు మంత్రి నారాయణ చెప్పారు. అయితే ఈ భూసేకరణకు సాధ్యాసాధ్యాలను పరిశీలిస్తున్నామని...రైతులు నష్టపోక్కుండా భూమిని ఎలా సేకరించవచ్చునో ఆలోచిస్తున్నామని అన్నారు. 5 వేల ఎకరాలు కావాలంటే.. సుమారు 30 వేల ఎకరాల్ని తీసుకోవాలి. దీనిలో రోడ్లు, రైతులకు రిటర్నబుల్ ప్లాట్లకు లేఅవుట్లు వేసి, డ్రెయిన్లు కట్టాల్సి ఉంటుంది' అని వివరించారు.

**షేక్ హసీనాకు బిగ్ షాక్.. ఈసారి అరెస్టు కావడం పక్కా?**

హైదరాబాద్ ను తీర్చిదిద్దినప్పుడు కూడా చంద్రబాబు చాలా విమర్శించారు. అక్కడ విమానాశ్రయం కోసం భూములు సేకరిస్తుంటే ఎందుకంటూ ప్రశ్నించారు. కానీ ఇప్పుడది ఎంత గొప్ప ఎయిర్ పోర్ట్ అయిందో

- తరువాయి 2లో..



## ఆఫ్ఘనిస్థాన్‌లో భారీ భూకంపం..
### ఢిల్లీలోనూ ప్రకంపనలు

భారత్ పొరుగు దేశమైన ఆఫ్ఘనిస్తాన్‌లో బలమైన భూకంపం సంభవించింది . బుధవారం ఆఫ్ఘనిస్తాన్‌లో 6.4 తీవ్రతతో భూకంపం సంభవించిందని... భారత్ పొరుగు దేశమైన ఆఫ్ఘనిస్తాన్‌లో బలమైన భూకంపం సంభవించింది . బుధవారం ఆఫ్ఘనిస్తాన్‌లో 6.4 తీవ్రతతో భూకంపం సంభవించిందని యూరోపియన్-మెడిటరేనియన్ భూకంప కేంద్రం (EMSC) తెలిపింది. భూకంప కేంద్రం 121 కిలోమీటర్ల (75 మైళ్ళు) లోతులో ఉంది. బలమైన ప్రకంపనలు రావడంతో ప్రజలు ఇళ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. భూకంపం కారణంగా ప్రాణనష్టం లేదా ఆస్తి నష్టం గురించి ప్రస్తుతానికి ఎటువంటి సమాచారం లేదు. ఈ భూకంప తీవ్రత ఢిల్లీ ఇతర



ప్రాంతాల్లోనూ కనిపించింది గత నెల మార్చి 29న కూడా ఆఫ్ఘనిస్తాన్‌లో భూకంప ప్రకంపనలు

- తరువాయి 2లో..

## రాజధానిలో టవర్ల నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం



- వార్త 3లో..

## ఆంధ్రప్రదేశ్ ఐటి రంగంలో
# గేమ్ ఛేంజర్ టిసిఎస్

**-మంత్రి లోకేష్ కృషితో ఐటి హబ్ గా విశాఖ**

**-5ఏళ్లలో 20లక్షల ఉద్యోగాల కల్పనలో మైలురాయి**



**అమరావతి ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

ప్రఖ్యాత ఐటి దిగ్గజం టిసిఎస్ కు విశాఖలో 21.16 ఎకరాలను 99పైసలకు కేటాయిస్తూ రాష్ట్రప్రభుత్వం విప్లవాత్మకమైన నిర్ణయం తీసుకుంది. రాష్ట్రంలో 5ఏళ్లలో 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్న ఎన్నికల హామీని నెరవేర్చేందుకు చంద్రబాబునాయుడు నేతృత్వంలోని ప్రజాప్రభుత్వం వ్యూహాత్మకంగా ముందుకు సాగుతోంది. ఇందులో భాగంగా ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5లక్షల ఉద్యోగాలు కల్పించే లక్ష్యంతో మంత్రి నారా లోకేష్ చేస్తున్న ప్రయత్నాలు ఫలిస్తున్నాయి. మంత్రి లోకేష్ గతఏడాది అక్టోబర్ లో ముంబయ్ లోని టిసిఎస్ హౌస్ ను సందర్శించి తమ రాష్ట్రంలో డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేయాల్సిందిగా టాటా గ్రూప్ చైర్మన్ చంద్రశేఖరన్ కు విజ్ఞప్తిచేశారు. ఆ తర్వాత టిసిఎస్

- తరువాయి 2లో..

# రాష్ట్ర పునర్నిర్మాణానికి అండగా నిలవండి

**-స్వర్ణాంధ్ర 2047 ప్రణాళికకు ఊతం ఇవ్వండి -16వ ఆర్థిక సంఘాన్ని కోరిన ముఖ్యమంత్రి చంద్రబాబు**



**అమరావతి ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 15 శాతం గ్రోత్ రేట్ లక్ష్యంగా ప్రణాళికలు సిద్ధం చేసుకుని పని చేస్తుందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. ప్రభుత్వం 10 నెలలుగా తీసుకున్న చర్యలు, అమలు చేసిన విధానాల ద్వారా మెరుగైన ఫలితాలు సాధించామని సీఎం అన్నారు. రాష్ట్రంలో అనేక సమస్యలు ఉన్నాయని, దృఢమైన నిర్ణయాలతో, ఉత్తమ పాలసీలతో పాలన సాగిస్తూ సమస్యలను అధిగమిస్తున్నామని సీఎం అన్నారు. రాజధాని లేకపోవడం వల్ల రెవెన్యూ జనరేషన్‌కు అనేక సమస్యలు ఉన్నాయని సీఎం వివరించారు. ఈ కారణంగానే ప్రజల భాగస్వామ్యంతో ప్రపంచ స్థాయి రాజధాని నిర్మాణం చేపట్టామని రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ ఆర్థిక సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు. బుధవారం నాడు రాష్ట్ర పర్యటనకు వచ్చిన 16వ ఫైనాన్స్ కమిషన్‌కు సచివాలయం మొదటి బ్లాక్ వద్ద ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్వయంగా స్వాగతం పలికారు. అనంతరం సచివాలయం మొదటి బ్లాక్‌లో ప్రభుత్వం ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ఆర్థిక సంఘం ప్రతినిధులకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వివరించారు. రాజధాని అమరావతి నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, పోలవరం - బనకచర్ల అనుసంధాన ప్రాజెక్టు వంటి అంశాలపై ఏర్పాటు చేసిన ఎగ్జిబిషన్‌ను

- తరువాయి 3లో..




## ఏప్రిల్ 22న టెన్త్ ఫలితాలు విడుదల

**అమరావతి ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**




పదో తరగతి పరీక్షలు పూర్తయిన తరువాత విద్యార్థులు, తల్లిదండ్రులు ఇప్పుడు ఫలితాల కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. అందుకు తగ్గట్టుగానే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో పదో తరగతి ఫలితాల విడుదలకు సంబంధించి పనులు తుది దశకు చేరుకున్నాయి. ఇప్పటికే పరీక్షా పత్రాల మూల్యాంకనం పూర్తి అయ్యింది. ఇప్పటికే ఏపీలో ఇంటర్ ఫలితాలను విడుదల చేసారు. తెలంగాణలో ఇంటర్ ఫలితాలు ఈ నెల 24న విడుదలకు నిర్ణయం తీసు కొన్నారు. కాగా, పదో తరగతి ఫలితాలను ఏపీలో ఈ నెల 22న విడుదల చేసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. తెలంగాణలో మాత్రం కీలక అంశం పైన ప్రభుత్వ స్పష్టత కోసం వేచి చూస్తున్నారు. ఆ క్లారిటీ వచ్చిన తరువాతనే ఫలితాలను వెల్లడించే అవకాశం ఉంది. ఏపీలో పదో తరగతి పరీక్షా పత్రాల వాల్యుయేషన్ పూర్తయింది. మార్కుల గ్రేడింగ్ ప్రక్రియ కొనసా గుతోంది. ప్రస్తుతం మార్కులను ఆన్‌లైన్‌లో ఎంటర్ చేస్తున్నారు. ఇది కూడా దాదాపు తుది దశకు చేరుకుంది. దీంతో వారంలోపు పదో తరగతి పరీక్షల ఫలితాలు వెల్లడించేందుకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అన్ని సవ్యంగా కుదిరితే ఏప్రిల్ 22వ తేదీన టెన్త్ ఫలితాలు విడుదల చేయాలని విద్యాశాఖ భావిస్తోంది. రాష్ట్రవ్యాప్తంగా 6,49,884 మంది విద్యార్థులు పదో తరగతి పరీక్షలు రాశారు.

- తరువాయి 2లో..



## పాఠశాలలో 30 విద్యార్థులకు అస్వస్థత

**కోరుట్ల గురుకుల పాఠశాలలో 30 మంది విద్యార్థులకు అస్వస్థత**

**వైద్య సేవలతో తక్షణ శుభ్రతా చర్యలు**

**జగిత్యాల ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

జగిత్యాల జిల్లా Korutla పట్టణంలోని కల్లూరు రోడ్డులో ఉన్న సోషల్ వెల్ఫేర్ గురుకుల

- తరువాయి 2లో..



## రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక.. షెడ్యూల్ విడుదల

**విజయసాయిరెడ్డి రాజీనామాతో ఖాళీ - ఈనెల 22న నోటిఫికేషన్**

**మే 9న పోలింగ్**

న్యూ ఢిల్లీ : ఎపీలో ఖాళీగా ఉన్న ఒక రాజ్యసభ ఎంపీస్థానానికి ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసింది. వైఎస్సార్సీపీ రాజ్యసభ సభ్యుడు వి.విజయసాయిరెడ్డి రాజీనామా చేయడంతో ఖాళీగా ఉన్న ఈ స్థానానికి ఉప ఎన్నిక నిర్వహించనున్నట్లు ఈసీ పేర్కొంది.

**ఎన్నికల సంఘం షెడ్యూల్ ప్రకారం..**

ఈ నెల 22న నోటిఫికేషన్ జారీ చేస్తారు. 29 వరకు నామినేషన్లు స్వీకరిస్తారు. 30న నామినేషన్ల

- తరువాయి 2లో..



తెలుగురాష్ట్రం దినపత్రిక

# సంపాదకీయం

## కష్టం వేరొకరిది! కాసులు ఏఐవి!!

డిజిటల్ ప్రపంచంలో మరో కొత్త అంశం చక్కర్లు కొడుతోంది. ఎక్స్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సామాజిక మాధ్యమాలు కాస్తా ప్రఖ్యాత జపనీస్ యానిమేటర్ హయావో మియజాకీ శైలిలో గీసిన ఫ్యామిలీ, వ్యక్తిగత చిత్రాలతో నిండిపోతున్నాయి. గిబ్లీ ఆర్ట్ పేరు పెట్టుకున్న ఈ చిత్రాల ధోరణి నాలుగు దశాబ్దాల పాటు యానిమేషన్ రంగంలో ఎన్నో ప్రఖ్యాత క్యారెక్టర్లను సృష్టించిన గిబ్లీ స్టూడియో నకలు అన్నది మీకు తెలిసే ఉంటుంది.

తేలిక పాటి పేస్టల్ షేడ్స్‌లో క్యారెక్టర్ల చిత్రీకరణ దీని హైలైట్. ప్రస్తుతానికి ఈ గిబ్లీ ఆర్ట్ అన్నది ఏఐ ప్లాట్‌ఫామ్స్ కొన్నింటిలో ఉచితంగా లభి స్తోంది. కొన్ని క్లిక్‌ల సాయంతో ఏ చిత్రాన్నైనా గిబ్లీ ఆర్ట్‌గా మార్చేయ వచ్చు. సెలబ్రిటీలు, రాజకీయ నేతలు, ఫ్యాషన్ , స్పోర్ట్స్ ఇన్‌ఫ్లుయెన్స ర్లతో పాటు కొన్ని కోట్ల మంది ఇప్పటికే ఈ గిబ్లీ ఆర్ట్‌ను వాడేశారు.

**సరదాగా కనబడుతున్నా...**

కంటెంట్‌ను సృష్టించేందుకు ఉపయోగించే జనరేటివ్ ఏఐ టూల్స్ అందుబాటులోకి వచ్చి కొంత కాలం అయినప్పటికీ, 'ఓపెన్ ఏఐ' అభివృద్ధి చేసిన సరికొత్త ఏఐ టూల్ ఈ గిబ్లీ ఆర్ట్ ట్రెండ్‌కు కారణమైంది. ఛాట్‌జీపీటీ వంటి లార్జ్ లాంగ్వేజ్ మోడళ్లు మనం అందించే సమాచారం (టెక్స్ట్) ఆధారంగా మనకు కావాల్సిన సమ చారాన్ని వివిధ రూపాల్లో (ఆర్టికల్స్, సోషల్ మీడియా పోస్టులు వంటివి) తయారు చేస్తాయి.

అదే గిబ్లీ ఆర్ట్ వంటివి మల్టీమీడియా జనరేటివ్ ఏఐ టూల్స్! టెక్స్ట్‌తో పాటు వీడియోలు, వాయిస్, ఫొటోలు, మ్యూజిక్ వంటి వాటినన్నింటినీ అది తీసుకోగలదు. 'మిడ్ జర్నీ', 'స్టేబుల్ డిఫ్యూషన్ ', 'డాల్%-%ఈ' వంటివి టెక్స్టు తీసుకుని ఇమేజెస్ ఇవ్వగలవన్నది తెలిసిందే. డాల్%-%ఈతో ఢిల్లీ వీధుల చిత్రాలను ఎం.ఎఫ్.హుస్సేన్ లేదా జామినీ రాయ్ శైలిలో కొన్ని సెకన్ల సమయంలోనే తయారు చేయవచ్చు. ఇక 'లెన్సా' వంటివి ఇచ్చిన ఇమేజ్‌కు ప్రత్యామ్నాయాలను సృష్టిస్తాయి.

వీటితో పోలిస్తే గిబ్లీ ఆర్ట్‌కు ఎక్కువ ఆదరణ ఎందుకు లభించిందంటే... ఇవి ముద్దుగా, హాస్యస్ఫోరకంగా ఉండటమని చెప్పాలి. చూసేందుకు హాస్యస్ఫోరకంగానే ఉండవచ్చు కానీ, దీని వెనుక ఒక సీరియస్ సమస్య ఉంది. ఏదైనా ఏఐ వ్యవస్థ వాస్తవ ప్రపంచం నుంచి వచ్చే సమాచారం ఆధారంగానే పనిచేస్తుంది. ఈ సమాచారం ద్వారా ఏఐ వ్యవస్థలకు శిక్షణ అందుతుంది. రకరకాల మార్గాల ద్వారా ఏఐ వ్యవస్థలకు డేటా (టెక్స్ట్, ఇమేజెస్, సంగీతం) అందు తూంటుంది.

రస్కిన్ బాండ్ లేదా అమితవ్ ఘోష్ శైలిలో ఒక చిన్న కథ రాయమని మనం ఏదైనా లార్జ్ లాంగ్వేజ్ మోడల్‌ను అడిగా మనుకోండి... వీరిద్దరి రచనల తాలూకూ సమాచారం మొత్తాన్ని వెతికేస్తుంది ఏఐ! చివరకు కాపీరైట్ హక్కులున్న సమాచారం కూడా. కానీ ఏఐ కంపెనీలు ఈ కాపీరైట్ హక్కులు పొందకపోవడం గమ నార్హం. గిబ్లీ ఆర్ట్ విషయంలోనూ ఇదే జరుగుతోంది. ఏఐ మోడళ్లకు శిక్షణ ఇచ్చేందుకు ఏ కంపెనీ కూడా గిబ్లీ స్టూడియో తాలూకూ చిత్రా లను వాడుకునే హక్కులు తీసుకోలేదు.

బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారాన్నే తాము వాడుకుంటున్నట్లు ఏఐ కంపెనీలు చెబుతున్నా... రచయితలు, కళా కారుల స్పందన వేరుగా ఉంది. కాపీరైట్ చట్టాల్లోని 'ఫెయిర్ యూజ్' సిద్ధాంతం గురించి ఏఐ కంపెనీలు చదివితే మేలని వీరు అంటు న్నారు. అప్పుడే అమెరికా, యూరప్‌లలో న్యాయపోరాటాలైతే మొద లయ్యాయి.

**సృజనకారులకు దక్కేదేమిటి?**

గిబ్లీ ఆర్ట్ వంటి ఏఐ టూల్స్ అసలు సృజనాత్మకత అన్న అంశంపైనే సవాళ్లను లేవనెత్తుతున్నాయి. ఓ అందమైన పెయింటింగ్, కార్టూన్ క్యారెక్టర్, సంగీతం... ఇవన్నీ మనిషి సృజనకు మచ్చుతున కలు. ఇవన్నీ ఆ యా వ్యక్తుల సొంత అనుభవాలు, సందర్భాల నుంచి పుట్టుకొచ్చినవి. గిబ్లీ ఆర్ట్‌నే ఉదాహరణకు తీసుకుందాం. జపాన్ సమాజం, సంస్కృతులకు అది అద్దం పడుతుంది, అమెరికన్ సంస్కృతికి వాల్ట్ డిస్నీ స్టూడియో అద్దం పట్టినట్లు!

ఇలాంటి సృజనాత్మక కళాకృతులను యంత్ర సృష్టిగా మార్చడం లేదా ఒక ఏఐ సిస్టమ్ మానవ సృజనాత్మకత, అభినివేశాలకు విరు ద్ధంగా వెళ్లడం మేలైన ఆలోచనైతే కాదు. ఒక పెయింటింగ్‌ను పూర్తి చేసేందుకు కళాకారుడికి కొన్ని నెలల సమయం పట్టవచ్చు. అలాగే పుస్తకం రాయడానికి ఏళ్లు పడుతుంది. ఒక కార్టూన్ లేదా యానిమేషన్ స్ట్రిప్ తయారు చేసేందుకు ఆర్టిస్టులు వందల గంటలు కష్టపడాల్సి రావచ్చు. వీటన్నింటి ఆధారంగా పనిచేసే ఏఐ సృష్టించే ఆర్ట్‌కు పేరు, డబ్బు... రెండూ అసలు కళాకారులకే దక్కాలి.

అందుకే ఏఐ కంపె నీలు డేటా లాండరింగ్‌కు పాల్పడుతున్నాయనీ, కళాకారులకు దక్కా ల్సిన డబ్బు, క్రెడిట్ రెండింటినీ ఎగ్గొడుతున్నాయనీ విమర్శకులు వ్యాఖ్యానిస్తున్నారు. కొన్ని లక్షల మంది కళాకారులపై ఆధారపడి అభివృద్ధి అవుతున్న ప్రతి ఏఐ జనరేటివ్ మోడల్ కంపెనీ విలువ వందల కోట్ల డాలర్లుగా ఉండటం ప్రస్తావనార్హం. ఇవి వినియోగ దారుల నుంచి వేల డాలర్ల రుసుము వసూలు చేస్తూంటాయి. అయితే, అసలు కళాకారులకు ఇందులోంచి ఏమీ దక్కడం లేదు.

ఇమేజ్ జనరేటర్లు కళాకారులు కాదు కానీ... కళాకారులకు సవాలు విసురుతున్నాయి. జనరేటివ్ ఏఐ మోడళ్లు ఇప్పటికే ప్రపంచ వ్యాప్తంగా సృజనాత్మకత కలిగిన వారి జీవనోపాధిని దెబ్బ తీస్తున్నాయి. యానిమేషన్ రంగంలోని కళాకారులు, ఇల్లస్ట్రేటర్లు, డిజైనర్లపై ప్రభావం ఎక్కువే ఉంది. పైగా మానవ కళాకారులతో పోలిస్తే ఏఐ తయారు చేసే బొమ్మల్లో డెప్త్, భావ ప్రకటన తక్కువ. ఏఐ ఆకృతులు ఓ మోస్తరువి మాత్రమే!

**ఒప్పందాలు మేలా?**

ఇప్పుడు డిజిటల్ ప్రపంచం మొత్తం గిబ్లీ వంటి ఉచిత ఏఐ టూల్స్ ఉత్పత్తులతో నిండిపోయింది. సినిమా స్టుడియోలు, నెట్ వర్క్‌లు ఇప్పటికే ఈ ఏఐ టూల్స్‌ను శ్రమ, ఖర్చులు రెండూ తగ్గించేవిగా చూస్తున్నాయి. పదుల కొలదీ యానిమేటర్ల బృందాలను నియమించుకునే బదులు, కొందరు ఏఐ టెక్నికల్ డైరెక్టర్లను ఏర్పాటు చేసుకుంటున్నాయి. ఈ ధోరణి మనదేశంలో ఆందోళనకు కారణం అవుతోంది. వేల మంది భారతీయ టెకీలు హాలీవుడ్ స్టూడియోలు ఔట్‌సోర్స్ చేసే యానిమేషన్ వర్క్‌పై ఆధారపడి ఉన్నారు. వాళ్లు కంప్యూటర్ గ్రాఫిక్స్, ఇతర టూల్స్‌ను వాడుతున్నారు. కానీ ఏఐ టూల్స్‌తో ఆటోమేషన్ మరో స్థాయికి వెళ్తుంది.

ఈ సమస్యకు సులభ పరిష్కారం లేదు. కాపీరైట్ల విషయంలో న్యాయ స్థానాలకు వెళ్లడం ఒక మార్గం. డేటా ప్రొటెక్షన్ చట్టాలు, ఏఐ నియంత్రణలు ఇప్పుడిప్పుడే ఏఐ టూల్స్ తాలూకూ సైడ్ ఎఫెక్ట్స్‌పై దృష్టి పెడుతున్నాయి. కొంతమంది పబ్లిషర్లు, పుస్తక, సంగీత కంపె నీలు ఆదాయాన్ని పంచుకునే విషయంలో ఏఐ కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంటున్నాయి. తద్వారా తమ పుస్తకాలు, సంగీతం లేదా ఇతర కళలను ఏఐల శిక్షణకు ఉపయోగించుకునే వీలు ఏర్పడుతోంది.

డేటా ట్రెయినింగ్ కోసం ఎటూ టెక్ కంపెనీలు తమ కళను వాడుకుంటున్నట్లు వీరు భావిస్తున్నారు. బదులుగా ఒప్పందం కుదుర్చుకో వడం మేలని వీరి ఆలోచన. అనుమతులు తీసుకుని కళలు, సమా చారాన్ని ఏఐ ట్రెయినింగ్ కోసం వాడుకోవడం ఇంకొక మార్గం. సోషల్ మీడియా వేదికలు కూడా ఏఐ ఆధారిత ఇమేజెస్, వీడి యోలు, యానిమేషన్లను అనుమతించే విషయంలో ఆచితూచి వ్యవ హరించాలి. ప్రస్తుత గిబ్లీ ఆర్ట్ ట్రెండ్ ముప్పు లేదని అనిపించవచ్చు. కానీ... వాస్తవానికి ఇది మనకు మేలుకొలుపు లాంటిది!

## అమరావతికి రూ. 47,000 కోట్లు అవసరం

### సీఎం చంద్రబాబు



అమరావతి ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రాజధాని అమరావతికి ఇంకా రూ. 47వేల కోట్లు అవసరమవుతాయని 16వ ఆర్థిక సంఘానికి సీఎం చంద్రబాబు వెల్లడించారు. రాజధానిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ. 77,249 కోట్లు అవసరం కాగా%ా% వరల్డ్ బ్యాంక్, హడ్కో కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్మెంట్ బ్యాంక్ ద్వారా ఫండింగ్ రూ. 31,000 కోట్లు సమకూరాయని తెలిపారు. ఇంకా కావాల్సిన నిధులు రూ.47,000 కోట్లు అని వివరించారు.

# అప్పన్నను దర్శించుకున్న రాష్ట్ర మంత్రులు

▸▸ చందనోత్సవ ఏర్పాట్లపై సమీక్ష ▸▸ సమీక్షలో పాల్గొన్న ఆలయ ట్రస్ట్ బోర్డు చైర్మన్




సింహాచలం ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సింహగిరిపై కొలువుతీరిన శ్రీ వరహాలక్ష్మీ నృశింహస్వామిని రాష్ట్ర మంత్రులు దర్శించుకున్నా రు . స్వామిని దర్శించుకున్నవారిలో రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి , హెూంశాఖ మంత్రి అనిత , జిల్లా ఇంచార్జి మంత్రి డోలా వీరాంజనేయులు , ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పూసపాటి అశోకగజపతి రాజు , భీమిలి శాసనసభ్యులు గంటా శ్రీనివాసరావు , తూర్పు నియోజక వర్గ ఎం .ఎల్ .ఎ. వెలగపూడి రామకృష్ణ బాబు , పెందుర్తి శాసనసభ్యులు పంచకర్ల రమేష్ బాబు ,రాష్ట్ర తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు , గండి బాబ్జి , దేవదాయ కమిషనర్ కె .రామచంద్ర మోహన్ , స్వామిని దర్శించుకున్నవారిలో ఉన్నారు . వీరికి ఆలయ కార్యనిర్వహణాధికారి కె .సుబ్బారావు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు . స్వామి వారి కప్పస్తంభ ఆలింగనం అనంతరం వీరికి అంతరాలయంలో అర్చకులు ప్రత్యేక పూజలు, బేడా ప్రదక్షిణ నిర్వహించిన అనంతరం ఆలయ ఆస్థాన మంటపంలో వేదపండితులు వేదాశీర్వచనం పలికారు . అనంతరం ఈ నెల జరగబోవు చందనోత్సవ ఏర్పాట్లకు చేపట్టిన పనులను పరిశీలించారు . అక్కడనుండి నేరుగా కొండదిగువ శ్రీనివాసనగర్ లో గల దేవస్థానం కల్యాణమండపంలో జిల్లా కలెక్టరు హరేంద్ర ప్రసాద్ , మునిసిపల్ కమిషనరు పి.సంపత్ కుమార్ , జిల్లా సి. .పి. సంత్రా బాగ్జి , పలు శాఖాధికారులతో మంత్రులు చందనోత్సవ ఏర్పాట్లపై సమీక్ష నిర్వహించారు . ఈ కార్యక్రమంలో పోలిస్ ఉన్నతాధికారులు , దేవాదాయ శాఖ అధికార్లు , ఇంజనీరింగు అధికారులతో సమీక్షా కార్యక్రమం నిర్వహించారు .

## మూడు సిటీలు కలిపి మెగా సిటీ..

అందరూ చూస్తున్నారు. చంద్రబాబు ఎప్పుడూ రాబోయే పదేళ్ల గురించి ఆలోచిస్తారు. ఇప్పుడు అమరావతి గురించి కూడా అలానే ఆలోచిస్తున్నారు అన్నారు మంత్రి నారాయణ. మెగాసిటీలో విమానాశ్రయంతో పాటూ అతి పెద్ద స్టేడియం ను కూడా తీసుకురావాలని అనుకుంటున్నారు. అదే కనుక వస్తే దేశ విదేశాల నుంచి ఆటగాళ్ళు వస్తారు. వారి కోసం మరిన్ని సౌకర్యాలు ఏర్పడతాయి. ఆ విధంగా సిటీ ఎక్స్పాండ్ అవుతుంది అంటూ నారాయణ చెప్పుకొచ్చారు. అలాగే అమరావతి రాజధాని కోసం భూములు ఇచ్చిన రైతులు సందేహపడక్కర్లేదని..మరో మూడేళ్ళల్లో రాజధాని నిర్మాణాన్ని పూర్తి చేస్తామని హామీ ఇచ్చారు. ఏడాదిన్నరలో అమరావతిలో సుమారు 360 కి.మీ. ట్రంక్ రోడ్లు నిర్మిస్తాం. రెండున్నరేళ్లలో రైతుల రిటర్నబుల్ ప్లాట్ల లేఅవుట్లలోని రోడ్లు, మూడేళ్లలో ఐకానిక్ టవర్లు నిర్మిస్తామని వివరాలు చెప్పారు.

## ఆఫ్ఘనిస్థాన్‌లో భారీ భూకంపం..

### ఢిల్లీలోనూ ప్రకంపనలు

సంభవించాయి. ఈ భూకంప తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.7గా నమోదైంది. ఈ భూకంప కేంద్రం కాబూల్ సమీపంలో ఉంది. ఆఫ్ఘనిస్తాన్ తో పాటు, పాకిస్తాన్ లోని అనేక ప్రాంతాలలో కూడా భూకంపం ప్రభావం కనిపించింది.మార్చి 29కి ముందు, ఈ సంవత్సరం ఫిబ్రవరి 21న కూడా ఆఫ్ఘనిస్తాన్‌లో బలమైన భూకంపాలు సంభవించాయి. దీని తీవ్రత రిక్టర్ స్కేలుపై 4.9గా నమోదైంది. ఈ అర్ధరాత్రి భూకంపం కారణంగా, చాలా మంది ప్రజలు తమ ఇళ్లలోంచి బయటకు పరుగులు తీశారు. ఆఫ్ఘనిస్తాన్ చరిత్రలో అత్యంత ప్రమాదకరమైన, వినాశకరమైన భూకంపం అక్టోబర్ 10, 2005న సంభవించింది. ఈ భూకంపం రిక్టర్ స్కేలుపై 7.6గా నమోదైంది. పాకిస్తాన్ కాశ్మీర్ ప్రాంతానికి సమీపంలో కేంద్రీకృతమై ఉంది. ఈ భూకంపం ప్రభావం ఆఫ్ఘనిస్తాన్‌లోని అనేక ప్రాంతాల్లో కనిపించింది. ఆఫ్ఘనిస్తాన్‌లో జరిగిన ఈ విషాదంలో వందలాది మంది మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. వందలాది ఇళ్ళు, పాఠశాలలు, ఆసుపత్రులు, ఇతర భవనాలు ధ్వంసమయ్యాయి.

## ఆంధ్రప్రదేశ్ ఐటి రంగంలో గేమ్ ఛేంజర్ టిసిఎస్

ప్రతినిధులతో నిరంతర చర్చలు సాగించి చివరకు విజయం సాధించారు. విశాఖలో టిసిఎస్ డెవలప్ మెంట్ సెంటర్ కోసం ఆ సంస్థ రూ.1370 కోట్లు పెట్టుబడి పెట్టనుంది. దీని ద్వారా యువతకు 12వేల ఐటి ఉద్యోగాలు లభించనున్నాయి. ఐటి ఇన్వెస్టిమెంట్స్ విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం సీరియస్ గా దృష్టి సారించిందనడానికి ఇదొక ఉదాహరణ. విశాఖ నగరాన్ని ఐటి హబ్ గా మార్చడానికి మంత్రి నారా లోకేష్ చేస్తున్న కృషిలో టిసిఎస్ గేమ్ ఛేంజర్ కాబోతోంది. ఆంధ్రప్రదేశ్ ఐటీ పెట్టుబడులను ఆకర్షించేందుకు ఆయన ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు. విశాఖలో డాటా సెంటర్ల ఏర్పాటుకు ప్రముఖ సంస్థలు ఇప్పటికే ఏర్పాట్లు చేసుకుంటున్నాయి. గత ప్రభుత్వ నిర్వాకంతో ఐటి హిల్స్ నుంచి పారిపోయిన కంపెనీలన్నీ ఒక్కొక్కటిగా రాష్ట్రానికి తిరిగి వస్తున్నాయి. రాష్ట్ర ఉద్యోగాల కల్పన సబ్ కమిటీ చైర్మన్ గా మంత్రి నారా లోకేష్ చేస్తున్న ప్రయత్నాలు ఒక్కొక్కటిగా కార్యరూపం దాల్చుతున్నాయి. ఫలితంగా గత 10నెలల్లో 8లక్షల కోట్ల పెట్టుబడులు, 5లక్షలకు పైగా ఉద్యోగాలు కల్పించేందుకు వివిధ పారిశ్రామిక సంస్థలు ముందుకొచ్చాయి. బడా సంస్థలను ఆకర్షించేందుకు వివిధరకాల ప్రోత్సాహకాలు ఇవ్వడం ప్రభుత్వాల వ్యూహంలో భాగం. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ గతంలో గుజరాత్ సిఎంగా పనిచేసే సమయంలో టాటా మోటార్స్‌ను గుజరాత్‌లోని సనంద్‌కు తీసుకెళ్లేందుకు 99 పైసలకు భూమిని కేటాయించారు. ఇది గుజరాత్‌లోని ఆటో పరిశ్రమకు ఒక మైలురాయిగా నిలిచింది. అదేతరహాలో ఏపిలో టిసిఎస్ కు భూములు కేటాయించి ఐటి పరిశ్రమకు జవసత్వాలు నింపేందుకు కృషి జరుగుతోంది. గత అయిదేళ్లుగా రాష్ట్రంలో ఉనికి కోల్పోయిన ఐటిరంగానికి జవసత్వాలు నింపే దిశగా మంత్రి లోకేష్ చర్యలు చేపట్టారు. ఇన్వెస్టర్స్ ఫ్రెండ్లీ విధానాలతో నూతన ఐటి, ఎలక్ట్రానిక్స్ పాలసీలను ప్రకటించారు. దేశంలో మరే రాష్ట్రంలోని లేని విధంగా అత్యుత్తమ ప్రోత్సాహకాలతో 2024-29 సంవత్సరాలకు ఆంధ్రప్రదేశ్ ఎలక్ట్రానిక్స్ తయారీ విధానం, ఆంధ్రప్రదేశ్ సెమీకండక్టర్ %డ% డిస్ప్లే ఫ్యాబ్ పాలసీ, ఆంధ్రప్రదేశ్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ %డ% గ్లోబల్ కెపాబిలిటీ సెంటర్స్ పాలసీ, ఆంధ్రప్రదేశ్ డేటా సెంటర్ పాలసీలను ప్రకటించారు. అక్టోబర్ 25 నుంచి వారం రోజుల పాటు అమెరికాలో పర్యటించారు. సిలికాన్ వ్యాలీ, సీటెల్, న్యూయార్క్‌తో సహా ప్రధాన యుఎస్ నగరాల్లో రోడ్‌షోలు నిర్వహించారు. ఏపిలో పెట్టుబడి అవకాశాలపై ప్రపంచస్థాయి టెక్నాలజీ సంస్థల సీనియర్ ఎగ్జిక్యూటివ్‌లతో చర్చలు జరిపారు.టెస్లా, గూగుల్, యాపిల్, అడోబ్, మైక్రోసాఫ్ట్, ఫాల్కాన్ ఎక్స్, సేల్స్ ఫోర్స్, జడ్ స్కాలర్ వంటి 100 ప్రముఖ కంపెనీల ప్రతినిధులను కలిసి రాష్ట్రంలో ఆయా సంస్థల ఏర్పాటుకు గల అనుకూలతలను వివరించారు. ఐటి, ఎలక్ట్రానిక్స్ రంగాల్లో 5ఏళ్లలో 5లక్షలు ఉద్యోగాలు కల్పించడమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నారు.

## ఏప్రిల్ 22న టెన్త్ ఫలితాలు విడుదల

ఇంటర్ ఫలితాల తరహాలోనే పదో తరగతి ఫలితాల వెల్లడి మార్కులను ప్రత్యేకంగా వాట్సప్ ద్వారా అందించాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు కార్యాచరణ పూర్తయిన తరువాత అధికారికంగా వెల్లడించనున్నారు. తెలంగాణలోనూ పదో తరగతి మూల్యాంకనం పూర్తి చేసారు. మార్కుల జాబితాలను సిద్ధం చేస్తు న్నారు. వచ్చే వారం ఈ ఫలితాల విడుదలకు అధికారులు తుది కసరత్తు కొనసాగిస్తున్నారు. కాగా, ఈ సారి ఫలితాల వేళ ప్రభుత్వం నుంచి కీలక అంశం పైన స్పష్టత రావాల్సి ఉంది. పదో తరగతి లో గ్రేడింగ్ విధానం తొలిగించి మార్కులు ఇచ్చేలా తెలంగాణ ప్రభుత్వం జీవో జారీ చేసింది. ఇక మెమోల ముద్రణ ఎలా ఉండాలనే దాని పైన స్పష్టత ఇవ్వలేదు. దీని పైన స్పష్టత ఇస్తేనే ఫలితాలను విడుదల చేయాల్సి ఉంటుంది. వాల్యుయేషన్ పూర్తయినా ఈ అంశం పైన క్లారిటీ వస్తే మార్కుల జాబితాలను సిద్ధం చేసి ఫలితాలను వచ్చే వారం విడుదల చేసే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు.

## పాఠశాలల్లో 30 విద్యార్థులకు అస్వస్థత

పాఠశాలలో 30 మంది విద్యార్థులకు ఒక్కసారిగా అస్వస్థతకు గురయ్యారు. వాతావరణంలో వచ్చిన అకస్మాత్తు మార్పులతో చిన్నారులు డిహైడ్రేషన్‌కు లోనై, పలువురు జ్వరంతో బాధపడుతున్నారు. వెంటనే వారిని కోరుట్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. వీరిలో ఐదుగురు విద్యార్థుల ఆరోగ్య పరిస్థితి మరింత ప్రభావితమవడంతో వారిని ఏరియా ఆసుపత్రికి తరలించి అడ్మిట్ చేశారు. ప్రస్తుతం వారి ఆరోగ్యం నిలకడగా ఉందని అధికారులు తెలిపారు. ఇటువంటి అనారోగ్య పరిస్థితులపై స్పందించిన జిల్లా వైద్యాధికారి డాక్టర్ ప్రమోద్ కుమార్ మాట్లాడుతూ, వాతావరణ మార్పుల కారణంగా డిహైడ్రేషన్ ఎక్కువగా కలుగుతోందని, విద్యార్థులకు సరైన సమయంలో వైద్యం అందించామని వెల్లడించారు. మరోవైపు, %ఖశీతీబ్శ్రీఖ% పాఠశాలలో పనిచేస్తున్న ఏఎస్ఎం మరియు హెల్త్ సిబ్బంది కలిసి చిన్నారులను వెంటనే అల్లమయగుట్ట పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యాధికారి డాక్టర్ శివాని నిఖార్సైన పరిశీలన చేసి, మొదటిదశలో అవసరమైన వైద్యం అందించారు. కొంతమంది %ఖశీతీబ్శ్రీఖ% విద్యార్థుల రక్త నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం టీ-హబ్ ల్యాబ్‌కు పంపించారు. అనంతరం విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత మరియు వేసవి జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా వేసవిలో వడదెబ్బ నుంచి రక్షణ పొందేందుకు తలకు టోపీలు ధరించాలి లేదా తలపై తడి టవల్స్ చుట్టుకోవాలి, ఎక్కువగా మంచినీటిని తాగాలి, పగటి వేడిలో ఆటల్ని నివారించాలి అని సూచించారు. ఉదయం లేదా సాయంత్రం సమయాల్లోనే ఆటలు ఆడాలని తెలియజేశారు. ఈ సంఘటనపై స్పందించిన కోరుట్ల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ ఆసుపత్రిని సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాలేజీ ఇంచార్జ్ ప్రిన్సిపల్ అంకం సురేశ్, వైద్యాధికారులు డాక్టర్ సమీన, డాక్టర్ శివాని, హెల్త్ ఎడ్యుకేటర్ తులసి, ఎపిడమాలజిస్ట్ వంశీ, హెల్త్ ఎక్స్టెన్షన్ ఆఫీసర్ శ్రీధర్, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. అధికారులు విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షిస్తూ తగిన జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

## రాజ్యసభ స్థానానికి ఉప ఎన్నిక.. షెడ్యూల్ విడుదల

పరిశీ లన ఉంటుంది. మే 2 వరకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఇచ్చారు. మే 9న ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ఉంటుంది. అదేరోజు సాయంత్రం 5 గంటల నుంచి ఓట్లు లెక్కిస్తారు. 13వ తేదీలోపు ఈ ఎన్నికల ప్రక్రియ పూర్తికానుంది.

తెలుగురాష్ట్రం దినపత్రిక

# జనరల్ న్యూస్

https://epaper.teluguraastram.com

అమలాపురం
ఏప్రిల్ 17,
గురువారం 2025



## పోతురాజు ముగ్గుతో ముత్యాలమ్మ జాతర...

### అన్నదానం చేసిన దేవస్థానం ఈవో...




**శ్రీకాళహస్తి, ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**

శ్రీకాళహస్తి పట్టణంలోని ముత్యాలమ్మ జాతర సందర్భంగా బుధవారం పలు కార్యక్రమాలు జరిగాయి. ఈ సందర్భంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ఆవరణలో కళాకారులు పోతురాజు ముగ్గు వేశారు ముగ్గు చుట్టూ పూలు, నిమ్మకాయలు, గుమ్మడి కాయలతో అలంకరించారు. శ్రీకాళహస్తి దేవస్థానం ఈవో బాపిరెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. అంతేగాకుండా అన్నదానం ప్రారంభించారు. కార్యక్రమంలో దేవస్థానం డిప్యూటీ ఇఓ కృష్ణారెడ్డి, ఏఈవో హేమమాలిని, పర్యవేక్షకుడు రవి తదితరులు పాల్గొన్నారు. ముత్యాలమ్మ జాతర సందర్భంగా జనసేన నాయకులు కొత్తపేటలో అంబలి కార్యక్రమం నిర్వహించారు. పార్టీ నాయకులు చంద్రశేఖర్, వేణుగోపాల్, బాబు, లిఖిత్ సాయి తదితరులు అంబలి కార్యక్రమంలో పాల్గొన్నారు...

## 30న సింహాచలం చందనోత్సవం

### -సీఎం చంద్రబాబు రాక

### -మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి

**విశాఖపట్నం, ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



సింహాచలం దేవాలయంలో ఏప్రిల్ 30న చందనోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించనున్నట్లు ఆంధ్రప్రదేశ్ దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ఈ వేడుకకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కుటుంబ సమేతంగా రానున్నట్లు ఆయన తెలిపారు. వైసీపీ పాలనలో రాష్ట్రవ్యాప్తంగా అనేక ఆలయాలను పట్టించుకోలేదని, చందనోత్సవానికి ఈసారి చిన్న పొరపాటు కూడా జరగకుండా ఏర్పాట్లు చేస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ సందర్భంగా ఉత్సవం ఏర్పాట్లపై ముగ్గురు మంత్రులు, అధికారులతో మంత్రి ఆనం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆలయ ఏర్పాట్లు, భక్తులకు కల్పించాల్సిన సౌకర్యాలు వంటి అంశాలపై సుదీర్ఘంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి మాట్లాడుతూ.. " ఏప్రిల్ 30న జరగనున్న చందనోత్సవానికి సీఎం చంద్రబాబు కుటుంబ సమేతంగా హాజరవుతారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున ఆయన పట్టువస్త్రాలు సమర్పించనున్నారు. చందనోత్సవాన్ని ఈ సంవత్సరం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకుని నిర్వహించబోతుంది. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా చర్యలు తీసుకుంటున్నాం. ఉదయం 5 గంటల నుంచి సాయంత్రం 7 గంటల లోపు క్యూలైన్లో ఉన్న భక్తులందరికీ స్వామివారి దర్శనం కల్పిస్తాం. కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత ఏపీలోని దేవాలయాలకు వచ్చే భక్తులు 30 శాతం పెరిగారు. చాలా వాటిని రాష్ట్ర పండగలుగా సీఎం చంద్రబాబు ప్రకటించారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో దేవాలయాల్లో చాలా తప్పిదాలు జరిగాయి. ఆలయాల అంతరాలయంలోకి వెళ్లి మరీ కొంతమంది వీడియోలు తీసుకున్న ఘటనలు ఎన్నో జరిగాయి. ఇలా అంతరాలయంలో వీడియోలు తీయటం చాలా అరిష్టం. ఇలాంటి చేష్టలు వైసీపీ వాళ్లకే చెల్లుతాయి. ఈసారి చందనోత్సవంలో స్వామివారి దర్శనానికి ఎట్టి పరిస్థితుల్లోనూ ఫోన్లు అనుమతించడం లేదని చెప్పారు. ఈ సమావేశంలో దేవదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డితో పాటు హోంమంత్రి వంగలపూడి అనిత, రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, విశాఖ జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి డోలా బాల వీరాంజనేయులు, దేవదాయ శాఖ, పాల్గొన్నారు.

## రాజధానిలో టవర్ల నిర్మాణానికి టెండర్ల ఆహ్వానం

**అమరావతి, ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



అమరావతి, ఏప్రిల్ 16(గోదావరి ప్రతినిధి): రాజధాని అమరావతి నిర్మాణంలో అత్యంత కీలకమైన సచివాలయ టవర్ల నిర్మాణానికి సీఆర్డీఏ టెండర్లను పిలిచింది. సచివాలయానికి 4 టవర్లు, హెచ్‌వోడీ కార్యాలయానికి ఒక టవర్ నిర్మాణానికి టెండర్లు పిలిచింది సీఆర్డీఏ. హెచ్‌వోడీ టవర్ నిర్మాణానికి రూ.1,126 కోట్లకు టెండర్లను ఆహ్వానించింది. అలాగే సచివాలయం 1, 2 టవర్ల కోసం రూ.1,897 కోట్లకు, సచివాలయం 3, 4 టవర్ల కోసం రూ.1,664 కోట్లతో టెండర్లు జారీ చేసింది. మొత్తం 5 టవర్లను రూ.4,668 కోట్ల వ్యయంతో చేపట్టాలని ఏపీ ప్రభుత్వం నిర్ణయించింది. మే 1న సచివాలయ, హెచ్?వోడీ టవర్లకు టెక్నికల్ బిడ్లను సీఆర్డీఏ తెరువనుంది. సచివాలయంలో ఉండే హెచ్‌వోడీలకు సంబంధించి 45 అంతస్థులతో ఒక టవర్ నిర్మాణం, మిగతా టవర్లు 40 అంతస్థులతో నిర్మాణం జరుగనుంది. ఈ సచివాలయం టవర్లన్నీ కూడా డయాగ్రిడ్ స్ట్రక్చర్‌తో నిర్మించాలని సీఆర్డీఏ టెండర్ షెడ్యూల్‌లో పేర్కొంది. ఈ టెండర్ రాజధాని నిర్మాణంలో సచివాలయ టవర్ల నిర్మాణమే అత్యంత కీలకమని చెప్పుకోవచ్చు. ఈ సచివాలయ టవర్ల నిర్మాణాన్ని పూర్తి చేసేందుకు రెండున్నర సంవత్సరాల గడువు విధించారు. ఈ రెండున్నర సంవత్సరాల్లో వీటి నిర్మాణాలు పూర్తి చేయాలని అందులో పేర్కొన్నారు. ఇప్పటికే ప్రపంచ బ్యాంకుతో పాటు, ఏడీబీ, హడ్కో, జర్మనీకి సంబంధించిన కేఎఫ్‌డబ్ల్యూ బ్యాంక్ రాజధాని అమరావతిలో పలు నిర్మాణాల కోసం రూ.31వేల కోట్లు రుణాలుగా సమకూర్చాయి. ప్రపంచ బ్యాంకుకు సంబంధించి ఇప్పటికే రూ.480 కోట్లు మొదటి విడత రుణం కూడా మంజూరు అయ్యింది. ఈ మొదటి విడత రుణంతోనే సచివాలయ టవర్ల నిర్మాణానికి సీఆర్డీఏ టెండర్లను పిలిచింది.

# వక్ఫ్ బిల్లు చట్టభద్ధతపై స్టేకు సుప్రీంకోర్టు నిరాకరణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)**



ఇటీవల మోదీ సర్కారు ఆమోదించిన వక్ఫ్ బిల్లు చట్టభద్ధతను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్లపై సుప్రీం కోర్టు బుధవారం విచారణ ప్రారంభించింది. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్ కుమార్, జస్టిస్ కేవీ విశ్వనాథన్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ విచారణ చేపట్టింది. వక్ఫ్ బిల్లు చట్టబద్ధతను సవాల్ చేస్తూ సుప్రీం కోర్టులో 10 పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లు దాఖలు చేసిన వారిలో ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఓవైసీ, కాంగ్రెస్ ఎంపీ మహమ్మద్ జావేద్, టీఎంసి ఎంపీ మహువా మొయిత్ర, ఎస్పీ ఎంపీ జియా ఉర్ రెహమాన్, ఆర్జేడి ఎంపీ మనోజ్ కుమార్ ఝ, ఆప్ ఎమ్మెల్యే అమనాతుల్లా ఖాన్, మణిపూర్ ఎమ్మెల్యే షేక్ నూరుల్ హాసన్, వైసీపీ, డిఎంకె, టీవీకే అధినేత విజయ్, సిపిఐ సహా కొన్ని ముస్లిం సంఘాలు ఉన్నాయి. పిటీషనర్ల తరపున సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వాదనలు వినిపించారు. మరోవైపు వక్ఫ్ బోర్డు సవరణ చట్టంను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్ల విచారణకు ముందు తమ వాదనలు కూడా వినాలని పలు రాష్ట్రాలు సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలు చేశాయి. పిటిషన్లు దాఖలు చేసిన రాష్ట్రాల్లో అస్సాం, రాజస్థాన్, ఛత్తీస్‌ఘఢ్, ఉత్తరాఖండ్, హర్యానా, మహారాష్ట్ర ప్రభుత్వాలు ఉన్నాయి. వీరంతా ఈ చట్టాన్ని సమర్థిస్తూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. పార్లమెంటు చట్టం ద్వారా మత విశ్వాసంలో కీలకమైన అంతర్భాగ అంశాలలో తలదూర్చారని కపిల్ సిబాల్ అత్యున్నత న్యాయం స్థానం ముందుకు తీసుకెళ్లారు. ఆర్టికల్ 25, 26లకు వ్యతిరేకంగా వక్ఫ్ సవరణ చట్టం ఉందని కపిల్ సిబాల్ అన్నారు. "చట్టం ప్రకారం" అనే పదాలు ముస్లిం మతానికి సంబంధించిన ముఖ్యమైన ఆచారాన్ని ప్రభావితం చేస్తాయని కపిల్ సిబాల్ కోర్టుకు విన్నవించారు. "చట్టం ప్రకారం" అనే పదబంధం ఇస్లాం మతానికి సంబంధించి మౌలికమైన ఆచారాలను దూరం చేస్తుందని ఆయన కోర్టుకు తెలిపారు. వక్ఫ్-అలల్-ఔలాద్‌ను సృష్టించినప్పుడు మహిళల వారసత్వ హక్కులను నిరాకరించరాదు.. దీనిపై ప్రభుత్వం ఎలా నిర్ణయం తీసుకోగలదు? అంటూ కపిల్ సిబాల్ న్యాయస్థానం దృష్టికి తీసుకెళ్లారు. అయితే, హిందువులకు సంబంధించిన వారసత్వ విషయాల్లో కూడా ప్రభుత్వం చట్టం చేసిందని.. ముస్లిం సమాజం కోసం కూడా పార్లమెంట్ చట్టం చేసింది.. ఇందులో తప్పేముందని సిజెఐ సంజీవ్ ఖన్నా ప్రశ్నించారు. ఆర్టికల్ 26 అనేది సెక్యులర్. ఇది అన్ని మతాలకు వర్తిస్తుందని సిజెఐ సంజీవ్ ఖన్నా వ్యాఖ్యానించారు. ఇస్లాంలో వారసత్వం వ్యక్తి మృతి తర్వాత జరుగుతుందని.. కానీ ప్రభుత్వం మృతికి ముందే వారసత్వం వస్తుందని చెబుతుందని కపిల్ సిబాల్ వాదించారు. ప్రభుత్వ ఆస్తిగా గుర్తించిన లేదా ప్రకటించిన ఆస్తిని కొత్త చట్టం అమలులోకి వచ్చిన తర్వాత వక్ఫ్ గా పరిగణించరాదని కొత్త చట్టంలో ఉందని కూడా కపిల్ సిబాల్ కోర్టుకు తెలిపారు. వక్ఫ్ బోర్డులో ముస్లిమేతర అధికారిని నియమించారని.. ఇది తనంతట తానే రాజ్యాంగ విరుద్ధమని కపిల్ సిబాల్ అన్నారు. కొత్త చట్టం అమలులోకి వస్తే ముస్లింలకు చెందిన రక్షిత స్మారకం స్థలాన్ని కూడా ఇకపై వక్ఫ్ స్థలంగా పేర్కొనలేమని కపిల్ సిబాల్ కోర్టుకు విన్నవించే ప్రయత్నం చేశారు. అయితే వాదనలు విన్న అత్యున్నత న్యాయ స్థానం ఈ వక్ఫ్ బిల్లు చట్టభద్ధతపై స్టే ఇచ్చేందుకు నిరాకరించింది. రేపు మధ్యంతర తీర్పు ఇస్తామని చెప్పింది. దీంతో బీజేపీ శ్రేణులు సంబరాలు చేసుకుంటున్నారు.

# రాష్ట్ర పునర్నిర్మాణానికి అండగా నిలవండి

(మొదటి పేజీ నుంచి)

ఆర్థిక సంఘం ప్రతినిధులకు వివరించారు. రాజధాని విషయంలో రాష్ట్ర ప్రభుత్వ ఆలోచనలు వీడియో రూపంలో ప్రదర్శించి వివరించారు. రాష్ట్ర విభజన ప్రభావం, ఆర్థిక సవాళ్లు, 2014 తరువాత వృద్ధిరేటులో రాష్ట్రం సాధించిన ప్రగతి, ప్రవేశ పెట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై ఆర్థిక సంఘానికి సీఎం వివరించారు. 2019 తరువాత నాటి ప్రభుత్వం అనుసరించిన విధానాల కారణంగా రాష్ట్ర ప్రజలకు, ఆర్థిక వ్యవస్థకు జరిగిన నష్టాన్ని సీఎం వివరించారు. గత 10 నెలల కాలంలో చేపట్టిన కార్యక్రమాలు, స్వర్ణాంధ్ర విజన్ 2047, మౌలిక సదుపాయాల ప్రాజెక్టులు, పెట్టుబడులకు ఉన్న అనుకూలతలు, రాష్ట్ర ప్రభుత్వ పాలసీలు ప్రజెంటేషన్ ద్వారా సీఎం వివరించారు. గత 5 ఏళ్ల కాలంలో ఆర్థికంగా జరిగిన విధ్వంసం కారణంగా నేడు ఎదుర్కొంటున్న సవాళ్ల నేపథ్యంలో కేంద్రం అదనపు సాయం అందించాలని కోరిన సీఎం.. రాష్ట్రంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితులు దృష్ట్యా కేంద్రం కేటాయింపులు జరిపేలా సిఫారసులు చేయాలని సీఎం విన్నవించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ "16వ ఆర్థిక సంఘం ఛైర్మన్ అరవింద్ పనగారియా ఎంతో అనుభవం ఉన్న వ్యక్తి. ఆయన దేశానికి చేస్తున్న సేవలు ఎంతో విలువైనవి. పనగారియా నీతి ఆయోగ్‌లో పని చేసిన సమయంలోనే పోలవరం ప్రాజెక్టును రాష్ట్రానికి అప్పగించారు. దేశంలో ఉన్న ఇతర జాతీయ ప్రాజెక్టుల పురోగతి మందగించడంతో పోలవరం ప్రాజెక్టు పూర్తి కావాలంటే రాష్ట్ర ప్రభుత్వమే చేపట్టాలని సిఫారసు చేశారు. వచ్చే పుష్కరాలకు ముందే పోలవరం ప్రాజెక్టును పూర్తి చేస్తాం. ప్రాజెక్టు ప్రారంభోత్సవానికి మీరు కూడా రావాలని కోరుతున్నాను" అని అన్నారు. "ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశం వికసిత్ భారత్ వైపు ప్రయాణిస్తోంది. ఒకప్పుడు దేశ వృద్ధి రేటు చూసి ప్రపంచం హేళన చేసేది. కానీ నేడు ప్రపంచం గర్వించే స్థాయిలో భారత్ వృద్ధి సాధిస్తోంది. నేడు మనం ప్రపంచంలో 5వ పెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్నాం... 2028 నాటికి మూడవ స్థానానికి చేరుకుంటాం. 2047 నాటికి ప్రపంచంలో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా మనం అభివృద్ధి చెందుతాం. మరోవైపు ప్రపంచ వ్యాప్తంగా భారతీయులు సాధిస్తున్న విజయాలు స్ఫూర్తివంతంగా ఉంటున్నాయి. సంస్కరణలు దేశ ముఖచిత్రాన్ని మార్చే ఫలితాలను ఇస్తున్నాయి. ఉమ్మడి ఏపీలో తెచ్చిన అనేక సంస్కరణలు అనేక మార్పులు తెచ్చాయి. ఉమ్మడి రాష్ట్రంలో ఉన్నప్పుడు ఐటీని ప్రోత్సహించాం. మంచి ఫలితాలు వచ్చాయి. నేడు ఏఐ గురించి మాట్లాడుతున్నాం. జనాభా విషయంలో కూడా మేం ఒక పాలసీ తీసుకున్నాం. జనాభా నియంత్రణ నుంచి జనాభా నిర్వహణ వైపు ఆలోచిస్తున్నాం. ఇది భారత దేశానికి కీలకమైన దశ. అమృత్ కాల్ అని చెప్పాలి. దేశం అతి గొప్ప విజయాలు సాధించేలా ఫైనాన్స్ కమిషన్ కీలక భూమిక పోషించాలి అని కోరుకుంటున్నా" అని సిఎం అన్నారు. "నేను ప్రస్తుతం నాలుగవ సారి సీఎంగా ఉన్నాను. కానీ ఇన్ని సవాళ్లు, ఇన్ని ఆర్థిక కష్టాలు ఎప్పుడూ చూడలేదు. గత ప్రభుత్వం చేసిన ఆర్థిక అరాచకత్వానికి రాష్ట్రం తీవ్రంగా నష్టపోయింది. అప్పుల కోసం గత ప్రభుత్వం తహసీల్దార్ ఆఫీస్ లు కూడా తాకట్టు పెట్టింది. 25 ఏళ్లకు మద్యంపై వచ్చే ఆదాయాన్ని తాకట్టు పెట్టింది. ఇలాంటి సమస్యల నుంచి బయటకు వచ్చి రాష్ట్రాన్ని నిలబెట్టేందుకు గట్టి సంకల్పంతో పని చేస్తున్నాం. సంక్షేమ, అభివృద్ధి బ్యాలెన్స్ చేసుకుంటూ... సుపరిపాలన అందిస్తున్నాం. ఇలాంటి సమయంలో... ఈ రోజు మేం నిలబడేందుకు, ముందుకు వెళ్లేందుకు మీరు సాయం చేస్తే.. రేపు పుంజుకుని మాకున్న బలం ద్వారా అనూహ్య విజయాలు సాధిస్తాం. వికసిత్ భారత్ లక్ష్యాన్ని చేరుకోవడంలో మా వంతు పాత్ర పోషిస్తాం. తద్వారా దేశ నిర్మాణంలో ముఖ్యమైన రాష్ట్రంగా నిలుస్తాం. సాగునీటి ప్రాజెక్టులు పూర్తి చేసేందుకు, ఉద్యోగ కల్పనకు అవసరమైన పెట్టుబడులు సాధించేందుకు మేం అత్యధిక ప్రాధాన్యం ఇస్తున్నాం. జాబ్ ఫస్ట్ అనే నినాదంతో.. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అనే విధానంతో మేం పని చేస్తున్నాం"అని ముఖ్యమంత్రి వివరించారు. అనంతరం వివిధ అంశాలపై ఆర్థిక సంఘం తమ అభిప్రాయాలు చెప్పింది. రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన వాట్సాప్ గవర్నెన్స్ పై చైర్మన్ తో పాటు కమిషన్ సభ్యులు ప్రశంసలు తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ విధానాన్ని ప్రధాని నరేంద్ర మోదీ దృష్టికి తీసుకువెళ్లారా అని సీఎంను పనగరియా అడిగారు.. ఇంకా లేదని, వచ్చే నెలలో ప్రధానితో భేటీ సందర్భంగా ఆయనకు ఈ ప్రాజెక్ట్‌పై వివరిస్తామని సీఎం తెలిపారు. ప్రభుత్వ సేవలకు కార్యాలయాలకు వెళ్లే అవసరం లేకుండా ప్రతి ఒక్కరూ వాట్సాప్ ద్వారా సేవలు పొందే పరిస్థితి తీసుకువస్తున్నామని రానున్న రోజుల్లో 1000 సేవలు అందిస్తామని సీఎం ఈ సందర్భంగా చెప్పారు. ఒక ముఖ్యమంత్రి స్వయంగా ఆర్థిక అంశాలపై ప్రజెంటేషన్ ఇవ్వడం తమను ఎంతో ఆశ్చర్య పరిచిందని, వృద్ధి గణాంకాలపై ఇంత లోతుగా విశ్లేషించడం, కేంద్ర సాయం పొందేందుకు చేస్తున్న ప్రయత్నాలను పనగారియా ప్రశంసించారు. మరోవైపు 30 ఏళ్ల క్రితం తాను హైదరాబాద్ వెళ్లిన నాటికి... నేటికీ ఎంతో అభివృద్ధి చెందిందని.. ఇదంతా ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్ వల్లే సాధ్యమైందని ఆర్థిక సంఘం సభ్యురాలు అన్నెజార్జ్ మాథ్యూ అన్నారు. అమరావతి కూడా అదే స్థాయిలో చంద్రబాబు అభివృద్ధి చేస్తారనే నమ్మకం ఉందన్నారు.

**రాష్ట్ర ఆర్థిక స్థితిగతులపై ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రజంటేషన్**

"అతిపెద్ద తీర ప్రాంతం కలిగిన ఆంధ్రప్రదేశ్ తూర్పు దేశాలకు గేట్‌వేగా ఉంది. 3 పారిశ్రామిక కారిడార్లు, విశాఖ-చెన్నయ్, చెన్నయ్-బెంగళూరు, బెంగళూరు-హైదరాబాద్ కారిడార్లు ఉన్నాయి. 6 పోర్టులు, 7 ఎయిర్ పోర్టులు ఉన్నాయి. దేశ ఎగుమతుల్లో 5.8 శాతం రాష్ట్రం నుంచే అవుతున్నాయి. బ్లూ ఎకానమి, ఐటీ, నాలెడ్జ్ ఎకానమి, క్వాంటమ్ వ్యాలీ, డ్రోన్, ఐవోటీ, బ్లాక్ చెయిన్ వంటి నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందిపుచ్చుకోవడంలో రాష్ట్రం ముందుంది. గ్రీన్ హైడ్రోజన్, సోలార్, అమోనియా... ఇలా గ్రీన్ ఎనర్జీకి ఏపీ హబ్‌గా ఉంది. అటు హైదరాబాద్, బెంగళూరు, చెన్నయ్ వంటి నగరాలు అమరావతికి చేరువలో ఉన్నాయి. ఈ నాలుగు నగరాలను కలుపుతూ దక్షిణ భారత దేశం మరింత అభివృద్ధి చెందేలా ప్రణాళికలు సిద్ధం చేస్తే వికసిత్ భారత్ లక్ష్యంలో భాగం అవుతుంది. భారతదేశాన్ని 2047 కల్లా వికసిత్ భారత్‌గా తీర్చిదిద్దాలన్న లక్ష్యంలో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు విజన్ రూపొందించుకున్నాం. హెల్తీ, వెల్తీ, హ్యాపీ రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ తీర్చిదిద్దాలని లక్ష్యంగా పెట్టుకున్నాం. స్వర్ణాంధ్ర-2047 విజన్‌తో పది సూత్రాల ప్రణాళిక అమలు చేస్తున్నాం. ప్రతి కుటుంబానికి కనీస అవసరాలు తీర్చాలన్నదే ప్రభుత్వ లక్ష్యం. ప్రతి ఒక్క కుటుంబానికి సొంతిళ్లు, పరిశుభ్రమైన మరుగుదొడ్లు, కుళాయి కనెక్షన్, వంటగ్యాస్, సమృద్ధిగా విద్యుత్ సరఫరా, హైస్పీడ్ ఇంటర్నెట్ అందించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నాం. అటు గ్రామాల్లో రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, చెత్త నుంచి సంపద సృష్టి కేంద్రాలు, విద్యుత్ ఆదా చేసే వీధి లైట్లు, పాఠశాలలు, ఆరోగ్యకేంద్రాలు బలోపేతం చేసేలా చర్యలు చేపట్టాం. జీరో పావర్టీ లక్ష్యంగా సమాజంలో అట్టడుగున ఉన్న 20 శాతం మంది పేదలను.. అత్యున్నత స్థానంలో ఉన్న 10 శాతం మంది సంపన్నులు ఆదుకేనే పీ4 కార్యక్రమానికి శ్రీకారం చుట్టాం. సమాజంలో అసమానతలు తొలిగేలా చేయాలన్నది ప్రభుత్వ సంకల్పం. జనాభా వృద్ధిపైనా దృష్టి సారించాం" అని ముఖ్యమంత్రి చంద్రబాబు వివరించారు.

**స్వర్ణాంధ్ర - 2047 లక్ష్యాలు :**

"ఏడాదికి 15 శాతం వృద్ధి రేటు సాధించి 2047 కల్లా 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా ఆంధ్రప్రదేశ్ అవతరించేలా కృషి చేస్తున్నాం. అలాగే తలసరి ఆదాయం 42,000 వేల డాలర్లకు చేరడంతో పాటు ఎగుమతులు 450 బిలియన్ డాలర్లు, సగటు జీవిత కాలం 85 ఏళ్లు, అక్షరాస్యత 100 శాతం సాధించడం, నిరుద్యోగ రేటు 2 శాతానికి మించకుండా అభివృద్ధి చెందేలా చూస్తున్నాం" అని వివరించారు. "ప్రస్తుతం జీఎస్డీపీ రూ.18.25 లక్షల కోట్లు ఉండగా, 2028-29 నాటికి రూ.29.29 లక్షల కోట్లకు చేరుకోవాలనేది లక్ష్యం. ఇది సాకారం కావాలంటే 2029 కల్లా రూ.40 లక్షల కోట్ల పెట్టుబడులు రావాల్సి ఉంది. 2014లో రాష్ట్ర విభజనతో ఆదాయ వనరులు అన్నీ తెలంగాణకు వెళ్లాయి. కేవలం ప్రాథమిక రంగంపైన మాత్రమే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ ఆధారపడాల్సి వచ్చింది. 2014లో ఏపీకి 31శాతం ఆదాయం ప్రధానంగా వ్యవసాయ రంగం నుంచి వస్తే, తెలంగాణ రాష్ట్రానికి 16 శాతం మాత్రమే ఆదాయం వచ్చింది. అలాగే పరిశ్రమల రంగం నుంచి ఏపీకి 25 శాతం, తెలంగాణకు 22 శాతం, సేవల రంగం నుంచి ఏపీకి 44 శాతం, తెలంగాణ 61 శాతం వాటా ఉంది" అని వివరించారు. "2023-24 నాటికి ఏపీ ఆదాయంలో వ్యవసాయ రంగం వాటా 34 శాతం ఉంటే, భారతదేశానికి 20 శాతం, తెలంగాణకు 15 శాతం ఉంది. ఏపీలో పరిశ్రమల రంగం వాటా 24 శాతం ఉంటే, భారతదేశంలో 26 శాతం, తెలంగాణలో 18 శాతం ఉంది. ఏపీలో సేవలరంగం వాటా 42 శాతం ఉంటే, భారతదేశంలో 54 శాతం, తెలంగాణలో 67 శాతం ఉంది" అని చంద్రబాబు తెలిపారు. "ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి హైదరాబాద్ ప్రధాన ఆదాయ వనరుగా ఉండేది. రాష్ట్ర విభజనతో హైదరాబాద్ ఆదాయం ఏపీ కోల్పోయింది. దీంతో తెలంగాణకు ఆదాయంలో 75 శాతం హైదరాబాద్ నుంచే వస్తోంది. ఇది తెలంగాణ వృద్ధికి, తలసరి ఆదాయం పెరుగుదలకు, ఏపీ వెనకబాటుతనానికి కారణమైంది. గత ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2024 వరకు ఐదేళ్ల నిర్లక్ష్యం కారణంగా రాష్ట్రానికి ఆర్థికంగా కోలుకోలేని దెబ్బ తగిలింది. 2014 - 2019 మధ్య 13.49 శాతం సరాసరి వృద్ధి వుంటే... 2019-2024 మధ్య సరాసరి వృద్ధి 10.32 శాతానికి పడిపోయింది" అని చెప్పారు. "దేశంలోని ముఖ్యమైన రాష్ట్రాలతో పోల్చుకుంటే జీఎస్డీపీలో రాష్ట్ర సొంత ఆదాయ వనరుల శాతం ఏపీలో తక్కువుగా ఉంది. ఏపీలో 6.48 శాతం ఉంటే, తెలంగాణలో 9.51 శాతం, కేరళలో 8.49 శాతం, మహారాష్ట్రలో 7.93 శాతంగా ఉంది. విభజనతో జాతీయ సంస్థలు, విద్య-వైద్య సంస్థలు, భారత ప్రభుత్వ సంస్థలు ఏపీకి లేకుండా పోయాయి. విభజన చట్టం షెడ్యూల్ 9 ప్రకారం 91 ప్రభుత్వ కంపెనీలు, కార్పొరేషన్లకు సంబంధించి రూ.1.63 లక్షల కోట్లు, అలాగే షెడ్యూల్ 10 కింద ఉన్న 142 సంస్థలకు చెందిన రూ.39,191 ఆస్తుల పంపకం అంశం రెండు రాష్ట్రాల మధ్య విభజన జరిగి పదేళ్లవుతున్నా ఇంకా పెండింగ్‌లోనే ఉంది. రాష్ట్రం విడిపోయే నాటికి 2014-15లో ఏపీ తలసరి ఆదాయం రూ.93,903 ఉంటే, తెలంగాణ తలసరి ఆదాయం రూ.1,24,104గా ఉండేది. మొదటి ఐదేళ్ల మా పాలనలో ఏపీలో తలసరి ఆదాయం 13.21 శాతం పెరిగి 2019కి రూ.1,54,031కు చేరుకుంది. అదే కాలానికి తెలంగాణలో 13.37 శాతం పెరిగి రూ.2,09,848 అయ్యింది. 2019-24 మధ్య ఏపీలో తలసరి ఆదాయ వృద్ధి 9.18 శాతానికి పడిపోయింది. తెలంగాణలో మాత్రం 11.45 శాతం నమోదైంది. దీంతో 2023-24లో ఏపీ తలసరి ఆదాయం రూ.2,37,951, తెలంగాణ తలసరి ఆదాయం రూ.3,56,56 నమోదైంది. ఇలా రాష్ట్ర విభజన, గత ప్రభుత్వ విధ్వంసం కారణంగా తలసరి ఆదాయంలో తెలంగాణకు, ఏపీకి వ్యత్యాసం భారీగా పెరిగిపోయింది. దక్షిణ భారత రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ తలసరి ఆదాయమే అత్యంత తక్కువ" అని చంద్రబాబు 16వ ఆర్థిక సంఘం దృష్టికి తెచ్చారు. "రాష్ట్రానికి సొంతంగా వచ్చే ఆదాయం కన్నా... వడ్డీ చెల్లింపులు, పెన్షన్లు, జీతాలు..ఇలా ఖచ్చితంగా ఖర్చు చేయాల్సిన వ్యయం ఎక్కువుగా ఉంటోంది. 2023-24లో చూస్తే... మొత్తం ఖచ్చితంగా చేయాల్సిన వ్యయం రూ.1,0322 కోట్లు ఉంటే, సొంత ఆదాయం రూ.93,410 కోట్లు మాత్రమే ఉంది. అంటే ఆదాయం కన్నా, ఖచ్చితంగా చేయాల్సిన వ్యయం 110.6 శాతం ఎక్కువ ఉంది. ఇది రాష్ట్రానికి భారంగా మారింది. గత ప్రభుత్వ హయాంలో ఆర్థిక క్రమశిక్షణ లేకపోవడం, ఆదాయ వృద్ధిపై దృష్టి పెట్టకపోవడం రాష్ట్రానికి భారీగా నష్టం కలిగించింది. రెవెన్యూ వ్యయంపై ఎలాంటి నియంత్రణ లేదు. 2024లో అధికారం చేపట్టేనాటికి మొత్తం రుణాలు రూ.9.74 లక్షల కోట్లకు ఉంది. దీనికి తోడు గత ప్రభుత్వం చెల్లించకుండా వదిలేసిన బకాయిలు రూ.1.35 లక్షల కోట్లు ఉన్నాయి. మూలధన వ్యయం కూడా 2014-19లో 2.01 శాతం నుంచి 2019-24కి 1.38 శాతానికి తగ్గింది" అని వివరించారు. "2024లో అధికారంలోకి రాగానే గత ప్రభుత్వం మిగిల్చిన రూ.24,811 కోట్ల బకాయిలు చెల్లించాల్సి వచ్చింది. కేంద్ర ప్రాయోజిత పథకాలకు సంబంధించిన బకాయిలు రూ.13,085 కోట్లు తీర్చాం. మూలధన వ్యయానికి సంబంధించి రూ.13,314 కోట్లు చెల్లించాం. స్థానిక సంస్థలను బలోపేతం చేసేందుకు రూ.3,339 కోట్లు ఖర్చు చేశాం. అమరావతి, పోలవరం, ఇండస్ట్రియల్ హబ్, పోర్టుల నిర్మాణం కోసం నిధులు భారీగా ఖర్చు పెడుతున్నాం. రాష్ట్రాభివృద్ధి కోసం కొత్తగా 19 పాలసీలు ప్రవేశపెట్టాం. ఇండస్ట్రియల్ డెవలప్మెంట్ పాలసీ, ఫుడ్ ప్రాసెసింగ్ పాలసీ, ఎంఎస్ఎంఈ, మేరిటైమ్, క్లీన్ ఎనర్జీ, టూరిజం, ఎలక్ట్రానిక్స్ మ్యానుఫ్యాక్చరింగ్ పాలసీల ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులు ఆకర్షించేందుకు ప్రయత్నిస్తున్నాం. స్వర్ణాంధ్ర విజన్ -2047 సాకారం కావాలంటే వృద్ధి రేటు 15 శాతం ఉంటేనే సాధ్యమవుతుంది. 15 శాతం తగ్గకుండా వృద్ధి నమోదు చేయగలిగితే జీఎస్డీపీ రూ.347 లక్షల కోట్లకు చేరుతుంది. తలసరి ఆదాయం రూ.58,14,916కు పెరుగుతుంది. అదే 12.50 శాతం వృద్ధి నమోదైతే జీఎస్డీపీ రూ.214 లక్షల కోట్లు, తలసరి ఆదాయం రూ.35,85,473 అవుతుంది" అని వివరించారు. "ప్రతీ ఏటా ఆంధ్రప్రదేశ్ రెవెన్యూ లోటు పెరిగిపోతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.1,28,146 కోట్లు ఉంటే, 2030-31 నాటికి రూ.1,43,640 కోట్లకు చేరుతుందని అంచనా వేస్తున్నాం. వికసిత్ భారత్ సాధనలో రాష్ట్రాలు ముఖ్య పాత్ర పోషించాల్సి ఉంటుంది. దీనికి ఆర్థిక సంఘం వర్టికల్ డెవల్యూషన్ వాటా ప్రస్తుతం ఉన్న 41 శాతం నుంచి 50 శాతానికి పెంచాలి. అటు, హారిజెంటల్ డెవల్యూషన్‌లోనూ దక్షిణాది రాష్ట్రాల వాటా తగ్గిపోతోంది. 10వ ఆర్థిక సంఘం సమయంలో దక్షిణాది రాష్ట్రాలకు హారిజెంటల్ డెవల్యూషన్ 24.30 శాతం ఉంటే, 15వ ఆర్థిక సంఘానికి వచ్చే సరికి 15.80 శాతానికి తగ్గింది. హారిజెంటల్ డెవల్యూషన్‌లో ఏపీ వాటా పరిశీలిస్తే... దేశ జీడీపీ, జాతీయ జనాభా వాటా కన్నా తక్కువుగా ఉంది. ఇది ఆర్థికంగా ఏపీకి నష్టం కలిగిస్తోంది. రాష్ట్రాల్లో గ్రామీణ స్థానిక సంస్థలకు గ్రాంట్లు కేటాయించేటప్పుడు 70 శాతం వెయిటేజీ జనాభాకు, 20 శాతం వెయిటేజీ వ్యవసాయం, అనుబంధ రంగాలకు 10 శాతం వెయిటేజీ ప్రాంతానికి ఇవ్వాలని ప్రతిపాదన. గ్రామ పంచాయతీలు, మండల ప్రజా పరిషత్‌లు, జిల్లా పరిషత్‌లకు రూ.69,897 కోట్ల నిధులు అవసరం కాగా, రూ.7,381 కోట్లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. మరో రూ.62,516 కోట్ల నిధులు కావాల్సి ఉంది. పట్టణ, స్థానిక సంస్థల్లో తాగునీటి సరఫరా, పారిశుధ్యం, రహదారుల నిర్మాణం, అర్బన్ ట్రాన్స్‌పోర్ట్, వీధి లైట్లు, మురుగునీటి పారుదల వ్యవస్థల కోసం రూ.19,871 కోట్ల గ్రాంట్లు అవసరం అవుతుంది. అలాగే 2026-2031 మధ్య కాలానికి ప్రకృతి విపత్తులను ఎదుర్కొనేందుకు రూ.16,181 కోట్లు కావాల్సి ఉంది" అని తెలిపారు. "క్లీన్ ఎనర్జీకి రాష్ట్రంలో అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నాం. ఆంధ్రప్రదేశ్‌ను గ్రీన్ హైడ్రోజన్ హబ్‌గా తీర్చిదిద్దాలని అనుకుంటున్నాం. 2030 నాటికి 160 గిగావాట్ల పునరుత్పాదక విద్యుత్ ఉత్పత్తి లక్ష్యం. దీనికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు అవసరం ఉంది. 7.5 లక్షల ఉద్యోగాల కల్పన జరుగుతుంది. రాజధాని అమరావతిలో మౌలిక సదుపాయాలు, అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టేందుకు రూ.77,249 కోట్లు అవసరం కాగా... వరల్డ్ బ్యాంక్, హడ్కో, కేఎఫ్‌డబ్ల్యూ డెవలప్మెంట్ బ్యాంక్ ద్వారా ఫండింగ్ రూ.31,000 కోట్లు సమకూరాయి. ఇంకా కావాల్సిన నిధులు రూ.47,000 కోట్లు" అని వివరించారు.

**ఇవీ ఆంధ్రప్రదేశ్ అవసరాలు :**

1. పోలవరం-బనకచర్ల అనుసంధానం 2. తాగునీటి ప్రాజెక్టులు 3. 5 పర్యాటక హబ్‌లు(అమరావతి, విశాఖపట్నం, అరకు, తిరుపతి, రాజమహేంద్రవరం) ఐఐటీ తిరుపతిలో ఇంక్యుబేషన్ సెంబర్, బుద్ధిస్ట్ సర్క్యూట్, అమరావతిలో జాతీయ మ్యూజియం, విశాఖపట్నంలో వరల్డ్ క్లాస్ కన్వెన్షన్ సెంటర్ ఏర్పాటు 4. నాలెడ్జ్ ఎకానమీలో భాగమైన క్వాంటమ్ వ్యాలీ ప్రాజెక్టు, స్కిల్ డెవలప్మెంట్, రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్, 100 శాతం అక్షరాస్యత 5. పోర్టులు, ఫిషింగ్ హార్బర్లు, మల్టీ మోడల్ లాజిస్టిక్ పార్కులు, గ్రీన్ ఫీల్డ్ ఎయిర్ పోర్టులు, ఇన్‌ల్యాండ్ వాటర్ వేలు, రహదారులు 6. అమరావతి, విశాఖపట్నం, తిరుపతి రీజనల్ గ్రోత్ సెంటర్లు... ఈ ప్రాజెక్టులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి గ్రాంట్లు ఇచ్చేలా సిఫారసులు చేయాలని ఆర్థిక సంఘాన్ని ముఖ్యమంత్రి చంద్రబాబు కోరారు.oo




డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా

తెలుగురాష్ట్రం దినపత్రిక
https://epaper.teluguraastram.com



## ఆర్టీసీ కోనసీమ జిల్లా డి.పి.టి.ఓగా రాఘవకుమార్ బాధ్యతలు స్వీకరణ

అమలాపురం, ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా ఏపీఎస్ఆర్టీసీ జిల్లా ప్రజా రవాణా అధికారిగా ఎస్.టి.పి రాఘవ కుమార్ బుధవారం నాడు పదవీ బాధ్యతలు చేపట్టారు. కాకినాడ జిల్లా డి.పి.టి.ఓ ఎం.శ్రీనివాసరావు ప్రస్తుతం సంవత్సర కాలం నుంచి కోనసీమ జిల్లా ఇన్చార్జి డిపీటీవోగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న విషయం తెలిసినదే. ఈ మేరకు ఏపీఎస్ఆర్టీసీ హెడ్ ఆఫీస్ విజయవాడలో సి.సి.ఓ.ఎస్ గా బాధ్యతలు నిర్వహిస్తున్న రాఘవ కుమార్ కి కోనసీమ జిల్లా డిపిటిఓగా బదిలీ రావడం వలన బుధవారం నాడు ఎం. శ్రీనివాసరావు కోనసీమ జిల్లా డిపీటీవో బాధ్యతలను రాఘవ కుమార్ కి అందజేశారు. రాఘవ కుమార్ గారు గ్యారేజ్ ఆవరణలో మొక్కనాటి ఇష్టపడి పని చేస్తే ఫలితాలు అద్భుతంగా ఉంటాయని సిబ్బందికి తెలియజేశారు. డిపిటిఓ శ్రీనివాసరావు అమలాపురం డిపో అన్ని పేరామీటర్లలో అభివృద్ధి పథంలో ఉందని ఇదే స్ఫూర్తి మునుముందు కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అమలాపురం డిపో మేనేజర్ చల్లా సత్యనారాయణమూర్తి, రావులపాలెం డిపో మేనేజర్, నాలుగు డిపోల సూపర్వైజర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## పీహెచ్సీలను సందర్శించిన జిల్లా అధికారి వెంకటేశ్వరరావు



ఐ.పోలవరం, ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

:ఐ పోలవరం మండలం కేశనకూరు, జి వేమవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రములను బుధవారం జిల్లా మలేరియా అధికారి నక్కా వెంకటేశ్వరరావు సందర్శించారు. సీజనల్ వ్యాధులపై %చీఎదీణజూ%, , డ్రై డే ఫ్రైడే గురించి పీహెచ్సీ వైద్యాధికారితో చర్చించారు, సీజనల్ వ్యాధులపైతగు జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య సిబ్బందికి సూచించారు.జ్వరం వచ్చిన ప్రతిరోగికి మలేరియా పరీక్షలు చేయాలన్నారు. ప్రతి శుక్రవారం డ్రైడే ఫ్రైడే కార్యక్రమం చేపట్టాలని ఆదేశించారు.ఈ మేరకు రెండు పీసెస్ లోని రికార్డులను పరిశీలించి ల్యాబ్ టెక్నీషినకు తగు సూచనలు చేశారు. పిహెచ్సి సిబ్బందికి దోమల నివారణపై ప్రజలందరికీ అవగాహన కల్పించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో జి వేమవరం పీహెచ్సీ వైద్య అధికారి డాక్టర్ ఇందిరా శ్రీ కేశనకుర్రు పీహెచ్సీ వైద్యాధికారి డాక్టర ఎం ఎస్ రాజేష్ బాబు ,మరియు సబ్ యూనిట్ ఆఫీసర్ పి ఎస్ వి రాజకుమార్ మరియు రెండు పీహెచ్సీ ల ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బడ్జెట్ సమావేశాలను బహిష్కరించడం వైసీపీ చేతగానితనం

### - టీడీపీ నాయకుల ధ్వజం



రావులపాలెం ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

రావులపాలెం మండల ప్రజా పరిషత్ బడ్జెట్ సమావేశాన్ని వైసీపీ ప్రజా ప్రతినిధులు బాయికాట్ పేరుతో రాజకీయం చేస్తున్నారని టీడీపీ నాయకులు ధ్వజమెత్తారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయం వద్ద బుధవారం వారు మాట్లాడుతూ కొత్తపేట నియోజకవర్గంలోని మండల పరిషత్తుల్లో వైసీపీ అధికారంలో ఉండి మండలాలకు సంబంధించి బడ్జెట్ సమావేశాలను సక్రమంగా నిర్వహించక పోగా బాయ్ కాట్ చేయడం వారి చేతగానితనానికి నిదర్శనం అన్నారు. ప్రోటోకాల్ పాటించడం లేదని, సమావేశపు ఎజెండా ఇవ్వడం లేదని ఆరోపణలు చేస్తున్నారని, బడ్జెట్ సమావేశాల్లో బడ్జెట్ ప్రతులను ప్రతి ఒక్క సభ్యుడికి ఇవ్వడం జరుగుతుందని గుర్తు చేసారు. ప్రోటోకాల్ కు సంబంధించి వారు మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. వైసీపీ ప్రభుత్వ హయాంలోనే సర్పంచులకి, ఎంపీటీసీలకి కనీస సమాచారం ఇవ్వకుండా వాలంటీర్లతో స్థానిక ప్రభుత్వాలను నడిపిన విషయాన్ని మర్చిపోయారా అని ప్రశ్నించారు. కూటమి ప్రభుత్వం స్థానిక సంస్థలను బలోపేతం చేస్తోందని, కేంద్రం ఇచ్చే ఆర్థిక సంఘం నిధులు పంచాయతీలకు సక్రమంగా జమవుతున్నాయని చెప్పారు. వైసీపీ సర్పంచ్ హద్దులు మీరు మాట్లాడుతున్నారని ప్రభుత్వ పథకాలకు సంబంధించి లబ్ధిదారుల ఎంపికపై విధివిధానాల గురించి మాట్లాడటం మరచి నేరారోపణలు చేస్తున్నారని, మైనింగ్ సంబంధించి చెల్లింపులపై ఫైన్ కట్టమని ఆదేశాలున్నా చెల్లించకుండా కాలయాపన చేస్తున్న వారు నీతులు వల్లిస్తున్నారని ఎద్దేవా చేసారు. ప్రజలను తప్పుదారి పట్టించే విధంగా వైసీపీ ప్రజా ప్రతినిధులు వ్యవహరించడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఈ సమావేశంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ముత్యాల బాబ్జి, టీడీపీ మండల అధ్యక్షుడు గుత్తుల పట్టాభి రామారావు, నియోజకవర్గ ఎస్సీ సెల్ అధ్యక్షుడు పల్లి ఏసు తదితరులు పాల్గొన్నారు.





## పవర్ టిల్లర్లు పంపిణీ చేసిన ఎమ్మెల్యే

అమలాపురం, ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

2024-25 ఆర్థిక సంవత్సరానికి వ్యవసాయ శాఖ ద్వారా అమలాపురం నియోజకవర్గానికి మంజూరైన 12 పవర్ టిల్లర్లను శాసనసభ్యులు అయితాబత్తుల ఆనందరావు లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆమూడ చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు, గొల్లకోటి చిన్న, దంతులూరి వాసు రాజు, నగ్గిరెడ్డి సత్తిబాబు, నల్లా చిట్టి, పండు వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ప్రజాదర్బార్

### కొత్తపేట ఎమ్మెల్యే సత్యానందరావు



రావులపాలెం ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో గ్రామాల్లో సమస్యలు తిష్ట వేసాయని, ప్రజల సమస్యల్ని తెలుసుకుని పరిష్కరించేందుకే ప్రతి బుధవారం ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు అన్నారు. రావులపాలెం టీడీపీ క్యాంపు కార్యాలయంల వద్ద బుధవారం ఆయన ప్రజాదర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి ప్రజలు వినతులను ఎమ్మెల్యేకు అందజేశారు. ఈ వినతులపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ నేటి ప్రజాదర్బార్ లో 292 వినతులు వచ్చాయని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం వినతులను ఆయా శాఖ అధికారులకు పంపుతామని తెలిపారు. గత ప్రభుత్వంలో జగన్ పేదలను మోసం చేసి ఇచ్చిన ఇళ్ల పట్టాలపై అధికంగా వినతులు,ళపిర్యాదులు వస్తున్నాయని చెప్పారు. వాటిని త్వరలోనే పరిష్కరించి అర్హులకు ఇళ్ల పట్టాలు ఇచ్చేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని స్పష్టం చేశారు. ప్రజా సమస్యలపై ప్రభుత్వం చిత్తశుద్ధితో కృషి చేస్తుందని ఎమ్మెల్యే సత్యానందరావు స్పష్టం చేసారు. ఈ కార్యక్రమంలో తెలుగు రైతు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆకుల రామకృష్ణ తదితర కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## బడ్జెట్ సమావేశం నుంచి అధికార వైసీపీ సభ్యుల వాకౌట్

### ప్రోటోకాల్ పాటించడం లేదని ఆరోపణలు



రావులపాలెం ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అంబేద్కర్ కోనసీమ జిల్లా రావులపాలెం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వ సభ్య సమావేశం రసాభాసగా ముగిసింది. ఎంపీడీవో ఇ.మహేశ్వరరావు ఆధ్వర్యంలో సమావేశం ప్రారంభం కాగానే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన ఎంపీపీ కర్రి లక్ష్మి వెంకట నాగదేవి, జెడ్పీటీసీ కుడుపూడి శ్రీనివాసరావు, పలువురు ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్లు అధికారుల తీరుపై అసంతృప్తి వ్యక్తం చేశారు. కార్యాలయంలో జరిగే కార్యక్రమాలకు తమను పిలవడం లేదని, ప్రోటోకాల్ పాటించకుండా అవమానిస్తున్నారని ఆరోపిస్తూ సమావేశం నుంచి వాకౌట్ చేసారు. దీంతో సమావేశం రద్దయింది. అయితే ప్రతి సమాచారం సభ్యులకు తెలియజేస్తున్నామని, ఏవైనా ఇబ్బందులు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలని ఎంపీడీవో మహేశ్వరరావు సూచించారు. సమస్యల పరిష్కారానికి ప్రతి నెలా సమావేశాలు నిర్వహించేందుకు కూడా సిద్ధమని చెప్పారు. ఇదిలా ఉంటే వైసీపీ సభ్యుల తీరును ప్రతిపక్ష టీడీపీ సభ్యులు ఖండించారు. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే సమావేశంలో వివాదం సృష్టించారని ధ్వజమెత్తారు. ఈ సమావేశంలో తహశీల్దార్ ముక్తేశ్వరరావు, డిప్యూటీ ఎంపీడీవో గంగుల కృష్ణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## కందుకూరిని ఆదర్శంగా తీసుకోవాలి

రాజమహేంద్రవరం ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు నడయాడిన నేలపై ఉన్నత విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు అందరూ ఎంతో ధన్యులు అని, కందుకూరి ని ఆదర్శంగా తీసుకొని సమాజ హితం కోసం జీవించాలని వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ అన్నారు. బుధవారం విశ్వవిద్యాలయంలోని తెలుగు శాఖ ఆధ్వర్యంలో కందుకూరి వీరేశలింగం పంతులు జయంతి కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి విసి ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ హాజరై ఆయన చిత్రపటానికి పువ్వులు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నవయుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు ఎన్నో ప్రతికూల పరిస్థితులను ఎదుర్కొని సమాజ సంస్కరణకు కృషి చేసిన మహోన్నత వ్యక్తి అని కొనియాడారు. స్త్రీ విద్య, వితంతువులకు వివాహాలు వంటివి ఆనాటి కాలంలో నిర్వహించడం ఎంతో గొప్ప సాహస కార్యాలు అని గుర్తు చేశారు. అటువంటి మహనీయుని ఆదర్శంగా తీసుకుని నేటి తరం యువత సమాజ హితమైన కార్యక్రమాలు నిర్వహించడంలో ముందుకు రావాలన్నారు. తెలుగు శాఖలో కందుకూరి వీరేశలింగం, ఆదికవి నన్నయాలను ఆప్షనల్ సబ్జెక్టులు గా చదువుతున్న విద్యార్థులు వారి ఔన్నత్యాన్ని ఇతరులకు తెలియజేసేవారుగా ఎదగాలని సూచించారు. తెలుగు శాఖ ఆధ్వర్యంలో ఇటీవల గుజరాత్ రాష్ట్ర ముఖ్యమంత్రి భూపేంద్ర బాయ్ పటేల్ చేతులు మీదుగా రత్నసింహాజీ మహిదా మెమోరియల్ అవార్డును అందుకున్న వీసీ ఆచార్య ఎస్ ప్రసన్న శ్రీ ని సన్మానించి అభినందించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య జి సుధాకర్, ప్రిన్సిపాల్ ఆచార్య డి జ్యోతిర్మయి, తెలుగు శాఖ అధ్యాపకులు డా.తలారివాసు, డా.కె.వి.ఎన్.డి. వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి ఎద్దడి సమస్యలను అధిగమించాలి

## - జిల్లా కలెక్టర్ మహేష్ కుమార్

అమలాపురం, ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

అంబేద్కర్ కోనసీమ జిల్లాలో చిట్ట చివరి ఆయుకట్టు వరకు పంటలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా వ్యవసాయ, జలవనరుల, రెవెన్యూ శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని, సాగు నీటి ఎద్దడి సమస్యలను పూర్తిగా అధిగమించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సూచించారు. బుధవారం అమలాపురం కలెక్టరేట్ లో ఆయన జలవనరులు, రెవెన్యూ, వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించి రబి సీజన్లో సాగు నీటి ఎద్దడి సమస్యలపై సమీక్షించారు. ఉప్పలగుప్తం, కాట్రేనికోన, ఐ.పోలవరం, రాజోలు, అల్లవరం మండలాల్లోని కొన్ని గ్రామాల్లో ఖరీఫ్ సీజన్లో వరి నాట్లు ఆలస్యంగా వేయడం వల్ల, అకాల వర్షాల కారణంగా సాగు ఆలస్యమైనందున ఈ నెల 25వ తేదీ వరకు సాగునీరు అందించాల్సి ఉంటుందని క్షేత్రస్థాయి అధికారులు జిల్లా కలెక్టర్ దృష్టికి తెచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలాల వారీగా పంటల సాగుకు సంబంధించిన కారణాలతో నివేదిక రూపొందించిన తర్వాత నీటి లభ్యతపై జలవనరుల శాఖ ఉన్నతాధికారులకు నివేదించి సాగునీటి కొరతను





అధిగమించేందుకు చర్యలు తీసుకుంటామని చెప్పారు. ప్రతి ఆయకట్టు ఆఖరి ఎకరా వరకు సాగు నీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఆర్డిఓ కే. మాధవి, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసుబాబు, జలవనరుల శాఖ కార్యనిర్వాహక ఇంజనీర్ బి. శ్రీనివాసరావు, ఎస్.డి.సి కృష్ణమూర్తి, వ్యవసాయ శాఖ ఏడి సంపి, జలవనరుల శాఖ సహాయ ఇంజనీర్లు తదితరులు పాల్గొన్నారు





## రహదారుల అభివృద్ధికి కేంద్రం నుంచి నిధులు రాబడతా..

### ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి.

**ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో కలిసి అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న ఎంపీ మహేష్ కుమార్.**

ఏలూరు ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఏలూరు పార్లమెంటు నియోజకవర్గం పరిధిలోని రహదారుల అభివృద్ధికి అవసరమైన నిధులు కేంద్రం నుంచి రాబడతానని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. దెందులూరు మండలం సోమవరప్పాడులో రూ.74 లక్షలతో నిర్మించిన బీటీ రోడ్డు, సిమెంటు రోడ్డును, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ బుధవారం ప్రారంభించారు. అంతకు ముందు సోమవరప్పాడు ప్రధాన కూడలి వద్ద మాజీ ముఖ్యమంత్రి, దివంగత నందమూరి తారకరామారావు విగ్రహానికి ఎంపీ మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పూలమాలలు వేసి నివాళులర్పించారు. తమ గ్రామంలో రహదారి అభివృద్ధికి కృషి చేసిన ఎంపీ పుట్టా మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ కు సోమవారప్పాడు ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఎంపీ మహేష్ కుమార్, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ పై పూలవర్షం కురిపించి తమ అభిమానం చాటుకున్నారు. అనంతరం పెదవేగి మండలం గోపన్నపాలెం నుండి రామసింగవరం వరకు రూ.3 కోట్లతో నిర్మిస్తున్న రహదారి అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ శంకుస్థాపన శిలాఫలకం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎంపీ మహేష్ కుమార్ మీడియా సమావేశంలో మాట్లాడుతూ దెందులూరు నియోజకవర్గం పరిధిలోని సమస్యలను తాను, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రాధాన్యత క్రమంలో పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. అభివృద్ధి అంటేనే ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ అని, ప్రజలకు తన వంతు సేవలు అందిస్తున్నారని ఎంపీ పేర్కొన్నారు. గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం రహదారుల అభివృద్ధిని విస్మరించడంతో ఐదేళ్లపాటు ప్రజలు నరకం చవి చూశారని ఎంపీ తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రహదారుల అభివృద్ధిపై దృష్టి పెట్టిందని, ఫలితంగానే పల్లెల నుంచి పట్టణాల వరకు రహదారులు నూతన శోభను సంతరించుకుంటున్నాయని ఎంపీ వెల్లడించారు. మిగిలిన రహదారులను కూడా రానున్న రోజుల్లో అభివృద్ధి చేస్తామని ప్రజలకు హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ సోమవరప్పాడు రహదారిని రూ.74 లక్షలతో అభివృద్ధి చేయటం జరిగిందని, అలాగే గోపన్నపాలెం నుంచి రామసింగవరం వరకు రూ.3 కోట్లతో అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. ఎంపీ మహేష్ కుమార్ సహకారంతో దెందులూరు నియోజకవర్గం సమగ్ర అభివృద్ధికి తనవంతు కృషి చేస్తున్నట్లు ఎమ్మెల్యే ప్రభాకర్ స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ గారపాటి రామసీత, నాయకులు, ప్రజా ప్రతినిధులు, పాల్గొన్నారు.

## ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థికి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందన.



ఏలూరు ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థిని ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందించారు. జంగారెడ్డిగూడెం తపస్ కళాశాలకు చెందిన విద్యార్థి కె. జైత్ర ఎంపీసీలో 464 మార్కులు సాధించి తన ప్రతిభను చాటాడు. కళాశాల యాజమాన్యంతో కలిసి విద్యార్థి జైత్ర బుధవారం ఏలూరు క్యాంపు కార్యాలయంలో ఎంపీ పుట్టా మహేష్ కుమార్ ను మర్యాదపూర్వకంగా కలిశారు. అత్యుత్తమ మార్కులతో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థి జైత్రను ఎంపీ పుట్టా మహేష్ కుమార్ అభినందించి, శాలువా కప్పి సన్మానించారు. భవిష్యత్తులో మరింత ఉన్నతికి చేరుకోవాలని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ సూచించారు.

## డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పధకం ప్రారంభించిన ఎమ్మెల్యే బత్తుల

సీతానగరం ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



సీతానగరం మండలం వెదుళ్ళపల్లి గ్రామంలో శ్రీ బొల్లి మున్నియ్య మెమోరియల్ ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలలో 36 లక్షలతో నిర్మించిన కాంపౌండ్ వాల్, 45 లక్షలతో నిర్మించిన సత్య బోల్లిస్ సైన్స్ ల్యాబ్, ఫాకల్టీ సెంటర్ లను రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన రాజమహేంద్రవరం పార్లమెంట్ సభ్యురాలు శ్రీమతి దగ్గుబాటి పురందేశ్వరి, రాజానగరం నియోజకవర్గం బిజెపి కన్వీనర్ నీరుకొండ వీరన్న చౌదరి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో రాజానగరం నియోజవర్గం శాసనసభ్యులు శ్రీ బత్తుల బలరామకృష్ణ శ్రీమతి బత్తుల వెంకటలక్ష్మి, రూడా చైర్మన్ బొడ్డు వెంకటరమణ చౌదరి ఎన్డీఏ కూటమి నాయకులు పాల్గొన్నారు 6.50 లక్షలతో నూతనంగా నిర్మించనున్న డైనింగ్ హాల్ కు శంకుస్థాపన చేసిన రాజానగరం నియోజకవర్గం శాసనసభ్యులు బత్తుల బలరామకృష్ణ
అనంతరం పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్నం భోజనం పధకం ప్రారంభించి విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే బత్తుల బలరామకృష్ణ
ఈ కార్యక్రమంలో జనసేన తెలుగుదేశం బిజెపి పార్టీ నాయకులు, కార్యకర్తలు, వీర మహిళలు, జనసైనికులు, పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మూడేళ్లలో చింతలపూడి ఎత్తిపోతల పథకం పూర్తి

### ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్ వెల్లడి.

**చింతలపూడి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తో కలిసి పాల్గొన్న ఎంపీ మహేష్ కుమార్.**

ఏలూరు ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

సాగు, తాగునీటి సమస్య శాశ్వత పరిష్కారానికి చేపట్టిన చింతలపూడి ఎత్తిపోతల పథకాన్ని రానున్న మూడేళ్లలో పూర్తి చేసేందుకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందని ఎంపీ పుట్టా మహేష్ కుమార్ స్పష్టం చేశారు. ఏలూరు జిల్లా చింతలపూడి ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం జరిగిన అభివృద్ధి కమిటీ సమావేశంలో ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ తో కలిసి ఎంపీ పుట్టా మహేష్ కుమార్ పాల్గొన్నారు. గోద్రెజ్ కంపెనీ సమకూర్చిన రూ.10 లక్షల విలువైన పరికరాలను ఎంపీ మహేష్ కుమార్, ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా జరిగిన సభలో ఎంపీ మహేష్ కుమార్ మాట్లాడుతూ ఇటీవల ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆగిరిపల్లి పర్యటన సందర్భంగా చింతలపూడి ఎత్తిపోతల పథకంపై ప్రభుత్వ వైఖరిని వెల్లడించారని ఎంపీ మహేష్ కుమార్ తెలిపారు. గత వైఎస్ఆర్సీపీ ప్రభుత్వం చింతలపూడి ఎత్తిపోతల పథకం నిర్మాణాన్ని పూర్తిగా పక్కన పెట్టిందని, ఫలితంగానే ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని ఎంపీ పేర్కొన్నారు.







ఏలూరు-జంగారెడ్డిగూడెం ప్రధాన రహదారిని నాలుగు వరుసల రహదారిగా అభివృద్ధి చేయడానికి అవసరమైన నిధులు మంజూరు కోరుతూ ఇప్పటికే అధికారులు డిపిఆర్ (సమగ్ర పథక నివేదిక) ను ప్రభుత్వానికి సమర్పించారని ఎంపీ తెలిపారు. చింతలపూడి పట్టణంలో సెంట్రల్ లైటింగ్ ఏర్పాటుకు అవసరమైన నిధుల మంజూరుకు కృషి చేసినట్లు ఎంపీ స్పష్టం చేశారు. ప్రజలు తమపై పెట్టుకున్న నమ్మకాన్ని వమ్ము చేయకుండా ప్రజల ఆకాంక్షల మేరకు తాము పని చేస్తున్నామని ఎంపీ పేర్కొన్నారు. రాజకీయాలను ఎన్నికల వరకు పరిమితం చేసిన తాము కేవలం అభివృద్ధి పైన మాత్రమే దృష్టి పెట్టామని, సాధ్యమైనంత వరకు ఎక్కువ అభివృద్ధి పనులు పూర్తిచేసి రాను ఎన్నికల్లో తిరిగి ప్రజలను ఓట్లు అడుగుతామని ఎంపీ తెలిపారు. చింతలపూడి ఆసుపత్రిని 100 పడకల ఆసుపత్రిగా వర్గోన్నతి కల్పించడానికి ఎమ్మెల్యే సొంగా రోషన్ కుమార్ ఎనలేని కృషి చేస్తారని ఎంపీ స్పష్టం చేశారు. ఏలూరు పార్లమెంట్ పరిధిలో 8 ఫ్యాక్టరీలు ఉన్నాయని, వాటి నుంచి సిఎస్ఆర్ నిధులు సాధ్యమైనంత ఎక్కువ రాబట్టి స్మశానాల అభివృద్ధికి కేటాయిస్తామని ఎంపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే ఘంటా మురళి, డి.సి.హెచ్.ఎస్ పాల్ సతీష్, ఆస్పత్రి సూపరింటెండెంట్ నారాయణరావు, టిడిపి సీనియర్ నాయకుడు ముత్తారెడ్డి, టిడిపి, జనసేన, బిజెపి నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

## తుందుర్రులో రూ కోటి 42 లక్షలతో అభివృద్ధి పనులు ప్రారంభం

**తుందుర్రు నుంచి మత్స్యపురిపాలెంకు త్వరలోనే రోడ్లు పూర్తి చేస్తాం .. కేంద్ర మంత్రి వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు**

భీమవరం, ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)



గ్రామాలను పచ్చని వాతావరణంలో సుందరీకరణతో అభివృద్ధి చేస్తున్నామని కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే పులపర్తి రామాంజనేయులు (అంజిబాబు) అన్నారు. భీమవరం మండలం తుందుర్రు గ్రామంలో రూ కోటి 42 లక్షలతో పలు అభివృద్ధి పనులను కేంద్రమంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే అంజిబాబు ప్రారంభించారు. సుమారు రూ కోటి ఒక లక్షతో నిర్మించిన 60 వేల లీటర్ల ఆలమ్ ట్రీట్మెంట్ ప్లాంట్ ను, రూ 16 లక్షలతో రెండు సీసీ రోడ్లను ప్రారంభించారు. రూ 25 లక్షలతో హిందూ శ్మశాన వాటిక నిర్మాణం, శ్మశాన వాటిక ప్రహరీ గోడ నిర్మాణంకు శంకుస్థాపనలు వారు చేశారు. గ్రామాలను అభివృద్ధితోపాటు ఎంతో సుందరీకరణ చేస్తున్నామని అన్నారు. గతంలో రోడ్లకు ప్యాచ్ వర్క్ కూడా చేయలేదని, కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని, ఇక నుంచి కూడా అభివృద్ధి పనులు చేస్తామని, చేస్తూనే ఉంటామని, అతి సామాన్యుడికి కూడా వైద్యం అందించేలా ఈ ప్రాంతంలో వైద్యులను ఏర్పాటు చేస్తామని అన్నారు. భీమవరం, వీరవాసరంలోని 48 గ్రామాల్లోనూ శ్మశాన వాటికలను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. అనంతరం కేంద్ర మంత్రి శ్రీనివాస వర్మ, ఎమ్మెల్యే అంజిబాబులను సత్కరించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, కూటమి నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణా సేవా సంఘ సమాఖ్య అధికార ప్రతినిధిగా సుబ్రహ్మణ్యం





భీమవరం, ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆంధ్ర ప్రదేశ్ బ్రాహ్మణా సేవా సంఘ సమాఖ్య అధికార ప్రతినిధిగా వేలూరి సుబ్రహ్మణ్యం శర్మ (మాజీ కౌన్సిలర్ భీమవరం) ఎన్నికైయ్యారు. ఈనెల 15న ఏలూరులో జరిగిన బ్రాహ్మణా సేవా సంఘ సమాఖ్య నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకార మహోత్సవంలో సుబ్రహ్మణ్యం బ్రాహ్మణా సేవా సంఘ సమాఖ్య అధికార ప్రతినిధిగా ప్రమాణ స్వీకారం చేశారు. ఇచ్చిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించి సంఘ అభివృద్ధికి కృషి చేస్తామని అయన అన్నారు. బ్రాహ్మణా సేవా సంఘ సమాఖ్య అధికార ప్రతినిధిగా ఎన్నికైన సుబ్రహ్మణ్యంను శ్రీఉమా సోమేశ్వర గునుపూడి భీమవరం బ్రాహ్మణ సమాఖ్య సభ్యులు అభినందనలు తెలిపారు.

## వీరేశలింగం ఆశయ సాధనకు పునరంకితమవ్వాలి



- కందుకూరి 177 వ జన్మ దిన వేడుకల్లో పాల్గొన్న ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్సీ సోము వీర్రాజు, ఆదిరెడ్డి అప్పా రావు
- జన్మగృహ అభివృద్ధికి ఎంపీ లాడ్స్ నుంచి రూ 30 లక్షలు ఎంపీ ప్రకటన
- పూర్వ విద్యార్థుల తరపున అభివృద్ధికి సహకరించాలని ఎంపీ సూచన.

రాజమహేంద్రవరం ఏప్రిల్ 16 (తెలుగురాష్ట్రం ప్రతినిధి)

ఆనాడు సమాజంలో ఉన్న రుగ్మతలను రూపు మాపడానికి సంస్కరణలు తెచ్చిన నవ యుగ వైతాళికుడు కందుకూరి వీరేశలింగం పంతులు ఆశ యసాధనకు పునరంకితమ వ్వాలని ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి, అన్నారు. బుధవారం స్థానిక ఆనంద్ గార్డెన్స్ లో సంఘ సంస్కర్త వీరేశలింగం పంతులు 177వ జయంతి సందర్భంగా వీరేశలింగం, రాజ్యలక్ష్మి దంపతుల విగ్రహాలకు ఉదయం పూలమాలలు వేసి, సమాధుల వద్ద భక్త్యంజలి ఘటించారు. అనంతరం ఏర్పాటుచేసిన సభలో ఎంపీ పురందేశ్వరి మాట్లాడుతూ మహిళల పట్ల ఆరోజుల్లో కొనసాగుతున్న వివక్షతను వీరేశలింగం పంతులు గుర్తించి మహిళల అభ్యున్నతికి పాటుపడ్డారని అన్నారు. ఒక దేశం ప్రగతి సాధించడం ఆ దేశ మహిళల సాధికారత పై ఆధారపడి ఉందని, వివేకానంద స్వామి చెప్పడం జరిగిందని, అందుకు కోసం కృషి చేసిన కందుకూరి వీరేశలింగం మనందరికీ ఆదర్శ ప్రాయుడు అన్నారు. ముఖ్యంగా వితంతు పునర్వివాహం జరిపించి సంఘంలో సంస్కరణ తెచ్చారని, మహిళలను విద్యా వంతులను చేయడానికి విద్యా సంస్థలను పెట్టారని ఆమె పేర్కొన్నారు. మహిళల పట్ల ఈ రోజుల్లో కూడా కొన్ని విషయాల్లో వివక్షత కొనసాగుతోందని ఆమె పేర్కొంటూ, వీరేశ లింగం స్ఫూర్తితో అయన ఆశయ సాధనకు కృషి చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని, అదే ఆ మహనీయుని ఆశయ సాధనకు మనం పునరంకితం అవుదామని పిలుపు ఇచ్చారు. వీరేశలింగం జన్మగృహం అభివృద్ధికి ఎంపీ లాడ్స్ నుంచి రూ.30 నుంచి రూ.35 లక్షల మేర కేటాయించనున్నట్లు ఎంపీ ప్రకటించారు. వీరేశలింగం స్మృతి వనం అభివృద్ధి కోసం రూ.50 లక్షల అంచనా వేశారని , శాఖ పరంగా రూ.15లక్షల మాత్రమే ఇవ్వడం జరుగుతోందని, మిగిలిన మొత్తం ఎంపీ ల్యాండ్ నుంచి నిధులు కేటాయించనున్నట్లు ఆమె వివరించారు. అన్నీ ప్రభుత్వమే చేయాలంటే వీలుపడదని, అందుకే పూర్వ విద్యార్థులం తామంత తాముగా ముందుకొచ్చి, వీరేశలింగం సంస్థల అభివృద్ధికి సహకరించాలని ఎంపీ పురందేశ్వరి కోరారు. దీంతో పూర్వ విద్యార్థి సిహెచ్ సీతారామ నాయుడు స్పందిస్తూ పది వేల రూపాయల విరాళం ప్రకటించారు. పూర్వ విద్యార్థి , జిల్లా బిజెపి అధ్యక్షుడు ఫిక్కి నాగేంద్ర స్పందిస్తూ, 2003- 06 బ్యాచ్ తరపున రూ 2 లక్షల సేకరించి ఇవ్వగ లనని ప్రకటించారు. ఎమ్మెల్సీ సోము వీర్రాజు మాట్లాడుతూ ఆ రోజుల్లో సంఘంలో ఉన్న రుగ్మతలపై గుర్తించి, వాటిని రూపుమాపేందుకు స్పందించిన వ్యక్తులుగా కందుకూరి వీరేశలింగం, టంగుటూరి ప్రకాశం సదా స్మరానియులన్నారు. వాటిని రూపుమాపేందుకు పనిచేశారని అన్నారు. కొన్ని విద్యాసంస్థల్లో ఇప్పటికీ చిన్నారు లపై జరుగుతున్న వేధింపుల గురించి వింటున్నామని, వీటిని రూపు మాపడానికి వీరేశలింగం వంటి మహనీయులు సూచించిన మార్గాన్న నడవడం లో వారిని స్ఫూర్తిని తీసుకుని పనిచేయాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు మాట్లాడుతూ విటి కాలేజీలో స్టాటిస్టిక్స్ లెక్చరర్ గా సేవలందించిన తనకు వీరేశలింగం సంస్థలతో చిరస్మరణీయమైన అనుబంధం ఉందన్నారు. హితకారిణి సమాజం అధ్యక్షులుగా పని చేసినపుడు హితకారిణి ఆస్తు ల ఆదాయం పెంపు కోసం కృషి చేయడంతో పాటు వీరేశలింగం విద్యాసంస్థల అధ్యాపకు లు, సిబ్బంది జీతాల పెంపు చేయించానని, ఇక్కడి సమాధులను అభివృద్ధి చేశామని ఆయన గుర్తుచేస్తూ కున్నారు. ఈ సంఘం అభివృద్ధి కోసం ఏ సమస్య ఉన్నా సరే ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తామని చెప్పారు. హితకారిణి సమాజం ఈ కార్యక్రమంలో ఈవో జె వినోద్ కుమార్, మాజీ అధ్యక్ష కార్యదర్శులు, మాజీ ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు, నాట్యాచార్య సప్పా దుర్గా ప్రసాద్, బళ్ళా శ్రీనివాస్, కూటమి నాయకులు బొమ్ముల దత్తు, రేలంగి శ్రీదేవి, అనుశ్రీ సత్యనారాయణ, వై. శ్రీనివాస్, కాశీ నవీన్ కుమార్, ఎపిఆర్ చౌదరి, విటి విద్యాసంస్థల అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులు తదితరులు వీరేశలింగం దంపతుల సమాధులకు నివాళులర్పించారు.



తెలుగురాష్ట్రం దినపత్రిక

# విద్యపై కృత్రిమ మేధ సానుకూల ప్రభావం




**దిల్లీ: విద్యపై కృత్రిమ మేధ(ఏఐ) సానుకూల ప్రభావం చూపుతోందని ఒక సర్వే వెల్లడించింది. విద్యా రంగంలో సమగ్రత కోసం పనిచేస్తున్న అంతర్జాతీయ సంస్థ టర్న్‌టిన్ ఈ సర్వే నిర్వహణకు ప్రోద్బలం అందించగా, ఇంగ్లాండ్‌కు చెందిన మార్కెట్ రిసెర్చ్ సంస్థ వాన్సన్ బోర్న్ సర్వే నిర్వహించింది.**

ఇందులో భాగంగా భారత్, ఆస్ట్రేలియా, న్యూజిల్యాండ్, మెక్సికో, ఐర్లాండ్, అమెరికాలకు చెందిన 3500 మంది విద్యార్థులు, ఉపాధ్యాయులు, విద్యా సంస్థల నిర్వాహకుల అభిప్రాయాలు సేకరించారు. భారత్‌లో నిర్వహించిన సర్వేలో పాల్గొన్న వారిలో 93శాతం విద్యపై కృత్రిమ మేధ సానుకూల ప్రభావం చూపుతోందని అభిప్రాయపడ్డారు. భారత్‌లో కృత్రిమ మేధ లభ్యత చాలినంతగా ఉందని సర్వేలో పాల్గొన్నవారు వెల్లడించారు. చదువులో, ఇతరత్రా పనుల్లో కృత్రిమ మేధను ఉపయోగించి ఏవిధంగా ప్రయోజనం పొందవచ్చో తమకు తెలియదని భారత్‌లో సర్వేలో పాల్గొన్న వారిలో 50శాతం మంది పేర్కొన్నారు. "కృత్రిమ మేధ వల్ల కలుగుతున్న సానుకూల పరిణామాలు విద్యార్థులకు, ఉపాధ్యాయులకు, విద్యాసంస్థల నిర్వాహకులకు అద్భుత అవకాశాన్ని అందిస్తున్నాయి" అని టర్న్‌టిన్ సంస్థ దక్షిణాసియా ప్రాంతీయ డైరెక్టర్ చైతాలి మొయిత్రా అన్నారు.

# రైళ్లలోనూ ఏటీఎం సేవలు..!

**దిల్లీ: షాపింగ్ కాంప్లెక్స్‌లు, పెద్దపెద్ద కార్యాలయాల్లోనూ ఏటీఎం సేవలను చూస్తున్నాం. త్వరలో కదిలే ఏటీఎంలు కూడా రానున్నాయి. ప్రయాణికుల కోసం రైళ్లలోనూ ఈ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రైల్వే శాఖ కసరత్తు చేస్తోంది. ప్రయోగాత్మకంగా ఓ మార్గంలో వీటిని ప్రవేశపెట్టింది. సెంట్రల్ రైల్వే తొలిసారిగా ముంబయి-మన్మాడ్ పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా ఏటీఎంను ఏర్పాటు చేసినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.**



ప్రతి రోజు నడిచే ఈ ఎక్స్‌ప్రెస్‌లో.. ఓ ప్రైవేట్ బ్యాంక్‌కు చెందిన ఏటీఎంను ఏసీ ఛైర్‌కార్ కోచ్‌లో ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. త్వరలో పూర్తి స్థాయిలో ఈ సదుపాయాన్ని అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు. పంచవటి ఎక్స్‌ప్రెస్‌లో ప్రయోగాత్మకంగా దీనిని ఏర్పాటు చేసినట్లు సెంట్రల్ రైల్వే చీఫ్ పబ్లిక్ రిలేషన్స్ ఆఫీసర్ స్వప్నిల్ నీలా వెల్లడించారు. కోచ్‌లో గతంలో తాత్కాలిక ప్యాంట్రీగా ఉపయోగించిన స్థలంలో ఈ ఏటీఎంను ఏర్పాటు చేశారు. రైలు కదులుతున్నప్పుడు భద్రత పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఉండటానికి దీనికి షట్టర్ డోర్‌ను కూడా అమర్చారు. ఇందుకు సంబంధించి కోచ్‌లో అవసరమైన మార్పులను మన్మాడ్ వర్క్‌షాప్‌లో చేపట్టినట్లు అధికారులు వివరించారు.

పంచవటి ఎక్స్‌ప్రెస్ ప్రతి రోజూ ముంబయిలోని ఛత్రపతి శివాజీ మహారాజ్ టర్మినస్ నుంచి మన్మాడ్ జంక్షన్ వరకూ వెళ్తుంది. సుమారు 4.30 గంటల్లో గమ్యస్థానానికి చేరుకునే ఈ రైలు.. ఆ మార్గంలో కీలకమైంది. ఈ రైల్లో ప్రయోగాత్మకంగా ఏటీఎం సేవలను తీసుకొచ్చారు. త్వరలోనే మిగతా మార్గాల్లోని రైళ్లలోనూ ఏటీఎంలను ఏర్పాటు చేసే అవకాశాలు కన్పిస్తున్నాయి.

# ఛత్తీస్‌గఢ్‌లో మళ్లీ ఎన్‌కౌంటర్..

## మావోయిస్టు అగ్రనేతలు మృతి



**రాయ్‌పుర్: ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో మరోసారి కాల్పుల మోత మోగింది. బస్తర్ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో ఇద్దరు మావోయిస్టు కీలక నేతలు మృతిచెందారు. వీరి తలలపై రూ.13లక్షల రికార్డు ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు.**

కొండగావ్-నారాయణ్‌పుర్ సరిహద్దులోని అడవుల్లో మావోయిస్టులు నక్కినట్లు సమాచారం రావడంతో భద్రతా సిబ్బంది యాంటీ-నక్సల్స్ ఆపరేషన్ చేపట్టారు. ఈ క్రమంలో బలగాలను చూసిన మావోయిస్టులు కాల్పులు జరిపారు. భద్రతా సిబ్బంది ఎదురుకాల్పులు జరపడంతో వారు పరారయ్యారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రాంతంలో రెండు మృతదేహాలు, ఏకే-47 తుపాకీని బలగాలు స్వాధీనం చేసుకున్నాయి. మృతులను మావోయిస్టు అగ్ర నేత, కమాండర్ హల్దార్, ఏరియా కమిటీ సభ్యుడు రామి అని గుర్తించారు. హల్దార్‌పై రూ.8లక్షలు, రామిపై రూ.5లక్షల రివార్డు ఉన్నట్లు అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఈ అటవీ ప్రాంతంలో గాలింపు కొనసాగుతోందని బస్తర్ రేంజ్ ఐజీ పి.సుందర్‌రాజ్ వెల్లడించారు.

తాజా ఎన్‌కౌంటర్‌తో కలిపి ఈ ఏడాది ఇప్పటివరకు 140 మంది మావోయిస్టులు ఎన్‌కౌంటర్లలో మృతిచెందారు. వీరిలో ఒక్క బస్తర్ డివిజన్‌లోనే 123 మంది మరణించినట్లు అధికారులు తెలిపారు.

# లా కమిషన్ ఛైర్మన్‌గా జస్టిస్ దినేశ్ మహేశ్వరి నియామకం



**జస్టిస్ దినేశ్ మహేశ్వరి**

**దిల్లీ: న్యాయ కమిషన్ ఛైర్మన్‌గా సుప్రీంకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జడ్జి జస్టిస్ దినేశ్ మహేశ్వరి నియమితులయ్యారు. కొత్త కమిషన్ నియామకానికి ప్రధాని నరేంద్ర మోదీ ఆమోదం తెలిపినట్లు కేంద్ర న్యాయ మంత్రిత్వశాఖ మంగళవారం వెల్లడించింది.**

గతేడాది సెప్టెంబరు 3న 23వ లా కమిషన్ మూడేళ్ల కాలపరిమితితో ఏర్పడగా.. తాజాగా ఈ కమిషన్ ఛైర్మన్‌గా జస్టిస్ దినేశ్ మహేశ్వరి, కమిషన్ పూర్తిస్థాయి సభ్యులుగా హితేశ్ జైన్ (న్యాయవాది), ప్రొఫెసర్ డి.పి.వర్మ (లా ప్రొఫెసర్- బీహెచ్‌యూ) మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ కమిషన్ పదవీ కాలం 2027 ఆగస్టు 31వరకు కొనసాగనుంది. గత లా కమిషన్‌లో కూడా వర్మ సభ్యుడిగా ఉన్నారు. నిబంధనల మేరకు దేశవ్యాప్తంగా ఉమ్మడి పౌరస్మృతిని అమలుపరచవచ్చో లేదో కూడా లా కమిషన్ పరిశీలించనుంది. లా కమిషన్ ఛైర్మన్‌గా నియమితులైన జస్టిస్ మహేశ్వరి 2023 మే నెలలో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పదవీ విరమణ చేశారు. 2004 సెప్టెంబరు నెలలో రాజస్థాన్ హైకోర్టు న్యాయమూర్తిగా నియమితులైన ఆయన జులై 2014లో అలహాబాద్ హైకోర్టుకు బదిలీ అయ్యారు. అనంతరం ఫిబ్రవరి 2016లో మేఘాలయ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి అయ్యారు. అక్కడ నుంచి 2018 ఫిబ్రవరి నెలలో కర్ణాటక హైకోర్టుకు బదిలీ అయ్యారు. జనవరి 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా బాధ్యతలు చేపట్టారు.

# ట్రంప్ చర్యలతో అమెరికాకు అతి పెద్ద నష్టం ఇదే!



**అమెరికా అధ్యక్షుడు ట్రంప్ చర్యలవల్ల ఆ దేశానికి జరుగుతున్న అతి పెద్ద నష్టం ఏమిటి? స్టాక్ మార్కెట్ సూచీలు పడిపోవటమా? బాండ్స్ మార్కెట్ దెబ్బ తినటమా? డాలర్ విలువ తగ్గుతుండటమా? ఇవేవీ కావు. అన్నింటికన్న ముఖ్యమైనది విశ్వసనీయతకు కలుగుతున్న నష్టం. స్టాక్స్‌ను, బాండ్లను, కరెన్సీ విలువను దిద్దుబాటు చర్యలతో పునరుద్ధరించుకోవచ్చు. కానీ విశ్వసనీయత మౌలికమైనది. అది ఒకసారి దెబ్బతినటం మొదలైతే కోలుకునేందుకు చాలా సమయం తీసుకుంటుంది. అమెరికాకు ఇది అన్నింటికి మించిన నష్టమవుతున్నది. మరొకవైపు బహుళ ధ్రువ ప్రపంచ బలోపేతానికి దోహదపడుతున్నది. ఇది అమెరికా కోరుకోని ఫలితం.**

### డాలర్ బాండ్ల సంక్షోభం

దీనంతటికీ ఆరంభం దిగుమతి సుంకాలను ఒకేసారి 184 దేశాలపై హెచ్చించటమన్నది తెలిసిందే. సుంకాల చెల్లింపులు గతంలోనూ ఉన్నవే. అమెరికాయే గాక ఇతరులూ అప్పుడప్పుడు చేస్తుండినవే. ట్రంప్ ఒక కొత్త పద్ధతిని అనుసరిస్తూ ఒకేసారి అందరిపై ఒకే విధంగా అన్ని సరకులపై 10 శాతం పెంచి, కొద్ది రోజుల తర్వాత ఆ యా దేశాలతో వాణిజ్య లోటు అనే మొత్తాలపై 50 శాతం పెంచారు. కానీ బాండ్ల మార్కెట్‌కు, డాలర్ విలువకు నష్టాలు మొదలు కావటం జరిగింది. ఆ మాట ఆయన బహిరంగంగానే అంగీకరిస్తూ, 50 శాతం సుంకాల హెచ్చింపును అమలుకు తెచ్చిన కొద్ది గంటలలోనే ఆ చర్యను 90 రోజులపాటు వాయిదా వేయవలసి వచ్చింది.

# తెలుగు సంస్కృతీరాజం రామరాజీయం



ఆచార్య బిరుదురాజు రామరాజు గురించిన ఆలోచన రాగానే సంస్కృతి, సంప్రదాయం, సాధన, విద్వత్తు మూర్తీభవించిన వ్యక్తిని మనోనేత్రంతో చూస్తాం. 55 ఏళ్ళనాడు పరిచయమైన రామ రాజుగారు కీర్తిశేషులయ్యే వరకు నా మీద చూపిన వాత్సల్యం ఎప్పటికీ గుర్తుంటుంది. వయసులో చిన్నవాళ్ళయినా ప్రేమతోబాటు గౌరవం చూపే సౌజన్యం ఆయనది. దీన్ని ఎన్నో సందర్భాలలో నేను చవిచూచాను. 24 సంవత్సరాల వయస్సులోనే నన్ను ఉస్మానియా విశ్వవిద్యాలయం తెలుగు శాఖకు పిలిపించి తెలుగు ఎం.ఎ. విద్యార్థులకు జానపద సాహిత్యం మీద ఉప న్యాసం ఇప్పించారాయన. 26 ఏళ్ళ వయస్సులోనే పిహెచ్.డి. పరీక్షకునిగా చేశారు. 27 ఏళ్ళ వయసులో ఆంధ్రప్రదేశ్ జానపద సాహిత్య పరిషత్తు ప్రాదుర్భావ సందర్భంగా నాచేత ప్రధానోపన్యాసం ఇప్పించారు. 'గుణాః పూజాస్థానం గుణిషు నచ లింగం నచ వయః' అనే వాక్యానికి నిలువెత్తు ఉదాహరణ రామరాజుగారు.

హైదరాబాదుకు ఎప్పుడైనా వెళ్ళానంటే చిక్కడ పల్లిలో రామరాజుగారి నివాసానికి వెళ్ళి గంటల తరబడి మాట్లాడవలసిందే. జానపద విజ్ఞానంలో జరుగుతున్న కొత్త పరిశోధనలను గురించి అడిగి తెలుసుకొనే ఆయన ఆసక్తి ఆశ్చర్య పరిచేది. 'నేను చెప్పిందే చివరి వాక్యం. చేసేదేదో చేసేశాను. ఇక చేయవల సింది ఏదీ లేదు' అనే మనస్తత్వం కాదు రామరాజుగారిది. ఆయన చేసిన పరి శోధన, జానపద సాహిత్యంలో ఆయన కృషి తక్కువదేమీ కాదు. 'జానపద సాహిత్యంలో పరిశోధన చేయడానికి ఏముంది?' అని భావించే రోజుల్లో పట్టుబట్టి జానపదగేయ సాహిత్యాన్ని పరిశోధనాంశంగా తీసు కున్న సందర్భం తెలుగులో జానపద పరిశోధనకు నాందీ వాక్యం పలికింది. తెలుగులో విస్తృతంగా జానపద విజ్ఞాన పరిశోధన జరగడానికి మూలకారణం రామరాజుగారే. జానపద సాహిత్య సేకరణ, వర్గీకరణ, వివేచన విషయంలో ఆయనదే ఒరవడి.

సంస్కృతి, సంప్రదాయాలు అంటే రామరాజుగారికి విపరీతమైన అభిమానం. అందువల్లనే మనకు తరతరాల వారసత్వంగా సంక్రమించిన జానపద సాహిత్యాన్ని ఆయన అంతగా అభిమానించారు. కాని అభిమా నించడంతో ఆగిపోలేదాయన. జానపద సాహిత్య పరిశోధనపైన దృష్టి సారించారు. పరిశోధనతో ఆగిపోక పోవడం ఆయన ముందుచూపునకు నిదర్శనం. ఆయన పరిశోధన గ్రంథాన్ని రెండోసారి ప్రచురించేటప్పుడు 1976లో నేను ప్రచురించిన 'జానప సాహిత్య స్వరూపం' పుస్తకాన్ని చూచినట్లుగా అందులో ఉటంకించారు. ఇది వారి హృదయ వైశాల్యాన్ని తెలుపుతుంది. జానపద విజ్ఞాన అధ్యయనాన్ని గురించి శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేయడం ఈ విషయంలో ఆయన ఆసక్తిని తెలుపుతుంది.

# ఫ్లాట్‌గా కొనసాగుతున్న స్టాక్ మార్కెట్ సూచీలు



**ముంబయి: దేశీయ మార్కెట్ల వరుస లాభాల జోరుకు బ్రేక్ పడింది. క్రితం రెండు సెషన్లలో భారీగా రాణించిన సూచీలు.. బుధవారం ఊగిసలాడుతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్ల బలహీన సంకేతాలు, టారిఫ్‌లపై కొనసాగుతున్న ఆందోళనలతో మదుపర్లు ఆచితూచి వ్యవహరిస్తున్నారు. దీంతో సూచీలు ఒత్తిడికి గురవుతున్నాయి. తొలుత నష్టాలతో ప్రారంభమైన సూచీలు ప్రస్తుతం స్వల్పంగా లాభాల్లో ఉన్నాయి.**

ఉదయం 9.30 గంటల సమయంలో సెన్సెక్స్ 27.7 పాయింట్ల లాభంతో 76,762 వద్ద, నిఫ్టీ 9 పాయింట్ల లాభంతో 23,337 వద్ద ట్రేడ్ అవుతున్నాయి. డాలర్‌తో రూపాయి మారకం విలువ 24 పైసలు బలపడి 85.56గా కొనసాగుతోంది. నిఫ్టీలో శ్రీరామ్ ఫైనాన్స్, ఇండస్‌ఇండ్ బ్యాంక్, అపోలో హాస్పిటల్స్, కొటక్ మహీంద్రాబ్యాంక్, యాక్సిస్ బ్యాంక్ షేర్లు రాణిస్తున్నాయి. ఇన్ఫోసిస్, మారుతీ సుజుకీ, టెక్ మహీంద్రా, టాటా కన్స్యూమర్, సిప్లా షేర్లు ఒత్తిడికి గురవుతున్నాయి.

ఆసియా మార్కెట్లు బుధవారం చాలావరకు నష్టాల్లో కొనసాగుతున్నాయి. హాంకాంగ్ హాంగ్‌సెంగ్ 2.11శాతం, దక్షిణ కొరియా కోస్పి 0.47శాతం, జపాన్ నిక్కీ 0.3శాతం మేర కుంగాయి. అయితే ఆస్ట్రేలియా ఏఎస్ఎక్స్ సూచీ మాత్రం 0.19శాతం లాభంతో రాణిస్తోంది. ఇక, అమెరికా మార్కెట్లు మంగళవారం నష్టాలతో ముగిశాయి. డోజెన్స్ 0.38శాతం, నాస్‌డాక్ 0.05 శాతం, ఎస్అండ్‌పీ 500 సూచీ 0.17శాతం మేర తగ్గాయి. అమెరికా ఫ్యూచర్ మార్కెట్లు కూడా నష్టాల్లోనే కొనసాగుతున్నాయి.

# బాబర్ ఆజం ఫ్రాంచైజీనే కాదు, ఫ్యాన్స్‌ను కూడా నిరాశకు గురి చేస్తున్నాడు

**పాకిస్తాన్ సూపర్ లీగ్ 2025 ఎడిషన్ బాబర్ ఆజంకు అస్సలు కలసి రావడం లేదు. వరుసగా విఫలమవుతూ తన ఫ్రాంచైజీనే కాదు, ఫ్యాన్స్‌ను కూడా నిరాశకు గురి చేస్తున్నాడు. తాజాగా ఓ అభిమాని తన వికెట్ చూసి ఏడ్వడం మొదలుపెట్టింది. ఈ వీడియో సోషల్ మీడియాలో తెగ వైరలవుతోంది. సోమవారం రావల్పిండిలో ఇస్లామాబాద్ యునైటెడ్‌తో జరిగిన మ్యాచ్‌లో పెషావర్ జల్మి కెప్టెన్ బాబర్ కేవలం 1 పరుగు మాత్రమే చేసి, పెవిలియన్ చేరాడు. దీంతో కోపోద్రిక్తురాలైన ఓ లేడీ అభిమాని.. మళ్లీ మళ్లీ అదే షాట్‌తో అవుట్ అవుతున్నాడంటూ ఏడుస్తోంది.**





గ్లాడియేటర్స్‌తో జరిగిన తొలి మ్యాచ్‌లో జల్మీ రెండు బంతులకు డకౌట్ చేరుకున్నాడు. తప్పనిసరిగా స్కోర్ చేయాల్సిన ఒత్తిడిలో ఉన్నాడు. దీంతో బాబర్ ఇస్లామాబాద్ యునైటెడ్ పేసర్ బెన్ ద్వార్షుయిస్‌కు బలయ్యాడు.

దీంతో ఈ లేడీ ఫ్యాన్ తెగ బాధపడిపోయింది. ఈ విధంగా ఔట్ కావడం ఇది మొదటిసారి కాదంటూ, అదే షాట్ ఆడుతూ ఔట్ అవుతున్నాడంటూ కన్నీరు పెట్టుకుంది.

తొలి మ్యాచ్‌లో క్వెట్టా గ్లాడియేటర్స్ చేతిలో 80 పరుగుల తేడాతో ఓడిపోయిన జల్మీ, డిఫెండింగ్ ఛాంపియన్స్ చేతిలో 102 పరుగుల తేడాతో ఓడిపోయింది. 244 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో రెండో ఓవర్లోనే బాబర్ వికెట్ కోల్పోయింది. ఆరంభంలోనే భారీ ఎదురుదెబ్బ తగిలింది. రెండంకెల స్కోరు సాధించిన ముగ్గురు బ్యాట్స్‌మెన్లలో మహ్మద్ హారిస్ ఒకడు. హాఫ్ సెంచరీ దాటిన ఏకైక బ్యాట్స్‌మన్ ఇతనే.

జల్మి ఇన్నింగ్స్ 18.2 ఓవర్లు మాత్రమే కొనసాగింది. చివరికి ఇమాద్ వసీం మూడు వికెట్లు తీయడంతో 141 పరుగులకే ఆలౌట్ అయింది. సాహిబ్‌జాదా ఫర్హాన్ 52 బంతుల్లో 106 పరుగులు చేసి ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు.

## కాలర్ ఎగరేసుకుంటూ వచ్చాడు.. కట్‌చేస్తే..

# అంపైర్ దెబ్బకు ఊహించని షాక్



**ఐపీఎల్ 2025లో, పంజాబ్ కింగ్స్‌తో జరిగిన మ్యాచ్‌లో కోల్‌కతా నైట్ రైడర్స్‌కు చెందిన అన్రిక్ నార్కియా తన బ్యాట్‌ను మార్చవలసి వచ్చింది. అన్రిక్ నార్కియా బ్యాట్ వెడల్పు ఎక్కువగా ఉండటం వల్ల అంపైర్ కఠిన నిర్ణయం తీసుకోవాల్సి వచ్చింది. అతిన బ్యాట్ బీసీసీఐ రూల్స్‌కు అనుగుణంగా లేకపోవడంతో ఈ నిర్ణయం తీసుకున్నారు. దీంతో మైదానంలోని అంపైర్లు నార్కియాను బ్యాట్ మార్చమని కోరారు. ఈ సంఘటన కేకేఆర్ ఇన్నింగ్స్ 16వ ఓవర్ ప్రారంభంలో జరిగింది. తరువాత కోల్‌కతాకు చెందిన రహ్మనుల్లా గుర్బాజ్ అన్రిక్ నార్కియాకు రెండవ బ్యాట్ అందించాడు.**

బ్యాట్‌ను తనిఖీ చేసే విధానం గత వారం నుంచే IPL 2025లో ప్రారంభమైంది. ఇందులో భాంగా మొదటగా రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు మధ్య జరిగిన మ్యాచ్‌లో షిమ్రాన్ హెట్మెయర్, నితీష్ రాణాల బ్యాట్‌లను టెస్ట్ చేశారు. ఆ తర్వాత ఢిల్లీ క్యాపిటల్స్, ముంబై ఇండియన్స్ మధ్య జరిగిన మ్యాచ్‌లో హార్దిక్ పాండ్యా బ్యాట్‌ను మైదానంలో కొలిచారు. ఇటువంటి పరిస్థితిలో, నార్కియా పరీక్షలో బ్యాట్ విఫలమైన మొదటి బ్యాటర్‌గా తేలాడు. నార్కియా కొత్త బ్యాట్ వచ్చే వరకు ఆట ఆగిపోయింది. ఆ తర్వాత వెంటనే, ఆండ్రీ రస్సెల్ బౌల్డ్ అయ్యాడు. పంజాబ్ కింగ్స్ జట్టు ఐపీఎల్ చరిత్రలో అతి చిన్న లక్ష్యాన్ని కాపాడుకుంది.

### బ్యాట్‌కు సంబంధించిన నియమాలు ఏలా ఉన్నాయి?

గతంలో ఐపీఎల్‌లో, బ్యాట్‌ల మందం, వెడల్పును డ్రెస్సింగ్ రూమ్ లోపలే కొలిచేవారు. నిబంధనల ప్రకారం, బ్యాట్ వెడల్పు 10.79 సెంటీమీటర్ల కంటే ఎక్కువ ఉండకూడదు. బ్యాట్ మందం 6.7 సెం.మీ కంటే ఎక్కువ ఉండకూడదు. అంచు వెడల్పు 4 సెం.మీ కంటే ఎక్కువ ఉండకూడదు. బ్యాట్ పొడవు 96.4 సెంటీమీటర్ల వరకు ఉంటుంది.

## ● ఒలింపిక్స్‌లో క్రికెట్..

# పోమోనా ఫెయిర్‌గ్రౌండ్స్‌లో మ్యాచ్‌లు ఫిక్స్..

**లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు క్రికెట్ వేదిక ప్రకటనపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ కూడా స్పందించింది. ఈ క్రీడల్లో క్రికెట్ విజయం కోసం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీతో కలిసి పనిచేస్తానని ఐసీసీ చైర్మన్ జై షా అన్నారు. 128 సంవత్సరాల తర్వాత క్రికెట్ ఒలింపిక్స్‌లో తిరిగి వస్తోంది.**



లాస్ ఏంజిల్స్ 2028 ఒలింపిక్ క్రీడలలో క్రికెట్ రీఎంట్రీ ఇచ్చిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో మ్యాచ్‌ల వేదికలు కూడా ప్రకటించారు. 128 సంవత్సరాల తర్వాత క్రికెట్ ఒలింపిక్స్‌లో తిరిగి వస్తోంది. దీని కింద, పురుషులు, మహిళల విభాగాలలో ఆరు జట్లు ఒక్కొక్కటిగా పాల్గొని బంగారు పతకం కోసం పోటీపడనున్నాయి. లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్ నిర్వాహకులు ఏప్రిల్ 15న దక్షిణ కాలిఫోర్నియాలోని పోమోనాలోని ఫెయిర్‌గ్రౌండ్స్‌లో క్రికెట్ మ్యాచ్‌లు జరుగుతాయని తెలిపారు. క్రికెట్ మ్యాచ్‌ల కోసం ఇక్కడ తాత్కాలిక స్టేడియం నిర్మించారు. ఒలింపిక్స్ తర్వాత ఈ స్టేడియం తొలగిస్తారు.

లాస్ ఏంజిల్స్ ఒలింపిక్స్‌కు క్రికెట్ వేదిక ప్రకటనపై అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ కూడా స్పందించింది. ఈ క్రీడల్లో క్రికెట్ విజయం కోసం అంతర్జాతీయ ఒలింపిక్ కమిటీతో కలిసి పనిచేస్తానని ఐసీసీ చైర్మన్ జై షా అన్నారు. '2028లో లాస్ ఏంజిల్స్‌లో క్రికెట్ వేదిక ప్రకటనను మేం స్వాగతిస్తున్నాం. ఎందుకంటే ఇది ఒలింపిక్స్‌లో మన క్రీడను తిరిగి చేర్చే దిశగా ఒక ముఖ్యమైన అడుగు' అని షా అన్నారు. క్రికెట్ చాలా ప్రజాదరణ పొందిన క్రీడ అయినప్పటికీ, ఒలింపిక్స్‌లో టీ20 ఫార్మాట్‌లో ఆడించనున్నారు. సాంప్రదాయ సరిహద్దులను దాటి వెళ్ళడానికి ఇది ఒక గొప్ప అవకాశం అవుతుంది. ఇది కొత్త వీక్షకులను తీసుకువస్తుంది.

### 1900 పారిస్ ఒలింపిక్స్‌లో క్రికెట్..

1900లో జరిగిన పారిస్ క్రీడలలో క్రికెట్ చివరిసారిగా ఒలింపిక్స్‌లో నిర్వహించిన సంగతి తెలిసిందే. 2023 అక్టోబర్‌లో ముంబైలో జరిగిన %×ఉజ% సమావేశం ద్వారా ఈ క్రీడ ఒలింపిక్స్‌లోకి తిరిగి వచ్చింది. క్రికెట్‌తో పాటు, బేస్ బాల్/సాఫ్ట్‌బాల్, ఫ్లాగ్ ఫుట్‌బాల్, స్క్వాష్, లాక్రోస్ కూడా 2028 ఒలింపిక్స్‌లో చేర్చింది.

ఒలింపిక్స్‌కు ఆరు జట్లను ఎలా ఎంపిక చేస్తారనేది ఇంకా నిర్ణయించలేదు. కానీ, ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్-5 జట్లు నేరుగా ప్రవేశించవచ్చని, ఒక జట్టు ఆతిథ్య అమెరికా నుంచి వచ్చే అవకాశం ఉందని అర్థం చేసుకోవచ్చు. గత కొన్ని సంవత్సరాలుగా, క్రికెట్ బహుళ క్రీడా ఈవెంట్లలో కనిపించింది. ఒలింపిక్స్‌కు ముందు, ఆసియా క్రీడలలో, ఇటీవల కామన్వెల్త్ క్రీడలలో క్రికెట్ మ్యాచ్‌లు జరిగిన సంతగి తెలిసిందే.

## ప్రాక్టీస్‌లో బద్ధకం..
## లైవ్ మ్యాచ్‌లో బెబ్బులి.. కట్‌చేస్తే..
## రూ. 12 కోట్లతో కేకేఆర్ కనకాభిషేకం



ప్రాక్టీస్ చేయమంటే బద్ధకం.. లైవ్ మ్యాచ్‌లో బెబ్బులి

ప్రాక్టీస్ మేక్స్ మెన్స్ ఫర్‌ఫెక్ట్ అనే సామెత ఉంది. అంటే ఎవరైనా ఏ పనిలోనైనా నిష్ణాతులు కావాలంటే, ఎంతో ప్రాక్టీస్ చేయాల్సి ఉంటుంది. అప్పుడే పరిపూర్ణ వ్యక్తిగా మారుతుంటారు. ఇది క్రికెట్‌కు కూడా వర్తిస్తుంది. ఓ క్రికెటర్ ఎంత కఠినంగా ప్రాక్టీస్ చేస్తే, అంత రాటుదేలుతుంటారు. ఈ క్రమంలో ఐపీఎల్‌లో అద్భుత ప్రదర్శన కోసం సాధన చేయని ఆటగాడు కూడా ఉన్నాడని మీకు తెలుసా. మరో కీలక విషయం ఏమిటంటే ఈ ప్లేయర్ మ్యాచ్‌కు ముందు ఎప్పుడూ ప్రాక్టీస్ చేయలేదంట. అయినప్పటికీ, అతను ప్రపంచంలోని అత్యుత్తమ ఆటగాళ్ళలో ఒకడిగా పేరుగాంచాడు. కేకేఆర్ జట్టు ఐపీఎల్ 2025లో అతనికి రూ. 12 కోట్లు ఇస్తుంది. కేకేఆర్ మిస్టరీ స్పిన్నర్ సునీల్ నరైన్ గురించే మనం మాట్లాడుతున్నాం. అతని గురించి కేకేఆర్ మాజీ వికెట్ కీపర్ మన్వీందర్ బిస్లా షాకింగ్ న్యూస్ చెప్పుకొచ్చాడు. ఈ ఆటగాడు ఎప్పుడూ ప్రాక్టీస్ చేయడని, నెట్స్‌లో బౌలింగ్ అస్సలు చేయడని, ఇదే అతని విజయ రహస్యమని బిస్లా చెప్పుకొచ్చాడు.

### నరేన్ గురించి బిస్లా షాకింగ్ విషయాలు..

మన్వీందర్ బిస్లా ఒక ఇంటర్వ్యూలో మాట్లాడుతూ, 'సునీల్ నరైన్ నెట్స్‌లో ఎప్పుడూ బ్యాట్స్‌మెన్‌కు బౌలింగ్ చేయడు. ముందుగా, అతనికి నెట్స్‌లో బౌలింగ్ చేయాలని అనిపించదు. రెండవది, భవిష్యత్తులో అతను ఇతర జట్లతో ఆడనున్నందున బ్యాట్స్‌మెన్స్ తన బంతులను అర్థం చేసుకోవాలని అతను కోరుకోడు. తాను కేకేఆర్ వికెట్ కీపర్‌గా ఉన్నప్పుడు, నరైన్‌ను 12-13 బంతులు వేయమని అడిగాను. తద్వారా అతని వైవిధ్యాలను అర్థం చేసుకోవచ్చని అనుకున్నాను' అంటూ మన్వీందర్ బిస్లా వెల్లడించాడు. అయితే, నరైన్ మాత్రం వేరియేషన్స్ తో బౌలింగ్ చేయలేదంటూ చెప్పుకొచ్చాడు.

### కేకేఆర్ జట్టులో నరైన్ కీలక ప్లేయర్..

సునీల్ నరైన్ కేకేఆర్ జట్టులో కీలక ఆటగాడిగా మారాడు. ఈ ఆటగాడు గత కొన్ని సంవత్సరాలుగా కేకేఆర్ అనుబంధం కలిగి ఉన్నాడు. అతను జట్టులో ఒక మిస్టరీ స్పిన్నర్‌గా చేరాడు. నేడు అతను ఒక తుఫాను ఆల్ రౌండర్‌గా మారాడు. కేకేఆర్ ఇన్నింగ్స్‌ను ప్రారంభించేలా ప్రేరేపించింది. అతను బ్యాట్‌తో కేకేఆర్ తరపున అనేక మ్యాచ్‌లను గెలిపించాడు. గత సీజన్‌లో నరైన్ బ్యాటింగ్‌తో పాటు బౌలింగ్ కూడా కేకేఆర్‌ను ఛాంపియన్‌గా నిలబెట్టడంలో కీలక పాత్ర పోషించింది. గత సీజన్‌లో నరైన్ 180 కంటే ఎక్కువ స్ట్రైక్ రేట్‌తో 488 పరుగులు చేశాడు. కేవలం 6.69 ఎకానమీ రేట్‌తో 17 వికెట్లు కూడా పడగొట్టాడు. నరేన్ విజయానికి కారణం అతను తన సహచరులను నమ్మకపోవడమే. నిజంగా చెప్పాలంటే, నరైన్ ఒక ప్రొఫెషనల్ క్రికెటర్, అందుకే అతని ప్రదర్శన ప్రతి సీజన్‌లో అద్భుతంగా ఉంటుంది.

# ఐపీఎల్‌లో ఫిక్సింగ్ కలకలం..

## సూత్రధారిగా హైదరాబాదీ..?

**ఐపీఎల్ 2025 ఉత్కంఠ తారాస్థాయికి చేరుకుంది. ఇంతలో, ఒక ఆశ్చర్యకరమైన వార్త వెలుగులోకి వచ్చింది. మీడియా నివేదికల ప్రకారం, ఐపీఎల్ 18వ సీజన్‌ను ఫిక్స్ చేయడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని తెలుస్తోంది. బీసీసీఐ అవినీతి నిరోధక, భద్రతా విభాగం (ఏసీఎస్‌యూ) ఇప్పటికే లీగ్‌లోని 10 జట్లను హెచ్చరించింది. ఎవరైనా తనను సంప్రదించడానికి ప్రయత్నిస్తే వెంటనే సమాచారం ఇవ్వాలని హెచ్చరించింది. %ూజాూఖ% ప్రకారం, ప్రస్తుతం టోర్నమెంట్‌పై అవినీతి మేఘాలు కమ్ముకుంటున్నాయి. దీనికోసం ఆటగాళ్లు, కోచ్‌లు, సహాయక సిబ్బంది, జట్టు యజమానులు, వ్యాఖ్యాతల కుటుంబాలకు అభిమానులుగా నటిస్తూ ఖరీదైన బహుమతులు ఇవ్వడం ద్వారా వారిని ఆకర్షించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయంట**

### సూత్రధారి ఎవరు?

క్రిక్‌బజ్‌లోని ఒక నివేదిక ప్రకారం, హైదరాబాద్‌కు చెందిన ఒక వ్యాపారవేత్త టోర్నమెంట్‌లో పాల్గొనే వారితో స్నేహం చేయడానికి ప్రయత్నిస్తున్నాడని %ూజాూఖ% విశ్వసిస్తోంది. అయితే, ఇది ఇంకా వెల్లడి కాలేదు. కానీ, ఈ వ్యాపారవేత్తకు బుకీలతో ప్రత్యక్ష సంబంధాలు ఉన్నాయని వెలుగులోకి వచ్చింది. సదరు హైదరాబాదీ బిజినెస్ మెన్ గతంలో కూడా ఇలాంటి అవినీతి కార్యకలాపాలకు పాల్పడ్డాడంట. అతని దగ్గర ఒక పాత రికార్డు ఉంది. అందువల్ల, ఐపీఎల్‌తో సంబంధం ఉన్న ప్రతి ఒక్కరినీ %ూజాూఖ% హెచ్చరించింది. ఈ వ్యాపారవేత్త ఏ విధంగానైనా సంప్రదించడానికి ప్రయత్నిస్తే వెంటనే నివేదించాలని కూడా పేర్కొంది. అతనితో ఎలాంటి సంబంధమైనా వెంటనే చెప్పాలని సూచించింది.





# నటిని చుట్టుముట్టిన సీతాకోక చిలుకలు

నటి వామికా గబ్బి పరిచయం అవసరం లేదు. బాలీవుడ్ లో రైజింగ్ స్టార్‌గా ఈ బ్యూటీ హృదయాలను గెలుచుకుంది. ప్రస్తుతం తన తదుపరి చిత్రం 'భూల్ చుక్ మాఫ్' విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలో రాజ్‌కుమార్ రావు సరసన వామిక నటించింది. మూవీ రిలీజ్ ముందు ముంబైలో జరిగిన హై-ఫ్యాషన్ గాలాలో వామిక ర్యాంప్ పై మెరిసింది. కళ్లు చెదిరే అందాన్ని డ్రమటైజ్‌గా ప్రెజెంట్ చేయడంలో తనకు సాటి లేరెవరూ అని వామిక నిరూపించింది. ఈ భామ ఆల్ బ్లాక్ ఎంబెస్‌మెంట్‌ను ఎంపిక చేసుకుంది. ప్రఖ్యాత 'ది వర్డ్' మ్యాగజైన్ కాస్ట్యూమ్ గాలాలో వామికా గబ్బి రెడ్ కార్పెట్‌పై గుబులు రేపే ప్రదర్శనతో ఆకట్టుకుంది. వైరల్‌గా చుట్టుముట్టిన సీతా కోక చిలుకలు తన ఒంటిపై వాలాయి! ఈ డ్రెస్ చూడగానే నెటిజనుల ఫీలింగ్ ఇది. ప్రత్యేకతతో కూడిన అందమైన డిజైనర్ బ్లాక్ గౌనును వామిక ధరించి కనిపించింది. స్ట్రాప్‌లెస్ కైలానీ బ్లాక్ గౌను ప్లంగింగ్ నెక్‌లైన్ తో ఎంతో ఆకట్టుకుంది. మెలోన్ క్రేప్ క్రిస్టల్ ఫాబ్రిక్‌తో తయారు చేసిన ఈ డ్రెస్ రిఫ్లెక్టివ్ షిమ్మర్ తో ఆకర్షణీయంగా కనిపిస్తోంది. ఈ నల్లటి గౌనును సీతాకోకచిలుకలతో డిజైన్ చేయడం సర్వత్రా ఆసక్తిని కలిగించింది. సీతా కోక హెడ్‌బ్యాండ్‌ను చేతితో ఎంబ్రాయిడరీ చేశారు. ఇది సెమిప్రెషియస్ రాళ్ళు, గాజు పూసలు, ఇత్తడి పదార్థంతో పొదిగినది. వామికా నల్లటి స్టడెడ్ చెవిపోగులు, స్టేట్‌మెంట్ రింగ్, మ్యాట్ బ్లాక్ మానిక్యూర్‌ను ఎంచుకుంది. ప్రస్తుతం ఈ స్పెషల్ ఫోటోషూట్ ఇంటర్నెట్ లో వైరల్ గా మారింది.

# న్యూ లుక్‌లో 'కుష్బూ'

సీనియర్ నటి ఖుష్బూ కొత్త లుక్ లో కనిపించి అందర్నీ ఆశ్చర్యపరిచారు.. ఇటీవల ఆమె చేసిన ఫోటో షూట్ చిత్రాలను తన ఎక్స్ ఖాతాలో పోస్ట్ చేశారు. ఖుష్బూ తను షేర్ చేసిన ఫోటోలకు 'బ్యాక్ టు ద ఫ్యూచర్' అనే క్యాప్షన్ పెట్టారు. దీనిపై కొందరు నెటిజన్లు ఆమె సన్నబడిన తీరును ప్రశంసిస్తుండగా, మరికొందరు మాత్రం సన్నగా మారడానికి ఇంజెక్షన్స్ చేయించుకున్నారని, వాటి మాయ వల్లనే ఇలా మారిపోయారని, వాటి గురించి ఫాలోవర్స్‌కు కూడా చెప్పండి అంటూ రకరకాలుగా కామెంట్స్ పెట్టారు. ఈ కామెంట్స్‌పై తీవ్ర అసహనం వ్యక్తం చేసిన ఖుష్బూ.. వారికి గట్టిగా కౌంటర్ ఇచ్చారు. "మీరెటువంటి మనుషులు? మీరెప్పుడూ మీ ముఖాలను సోషల్ మీడియాలో పంచుకోరు. ఎందుకంటే మీరు అంత అసహ్యంగా ఉంటారు. మీ తల్లిదండ్రులను చూస్తుంటే జాలి వేస్తోంది" అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు.



# 'శంబాల' మేకింగ్ వీడియో



ఆది సాయికుమార్ నటిస్తున్న 'శంబాల' చిత్రం నుండి తాజాగా మేకింగ్ వీడియో విడుదలైంది. ఓ మిస్టిక్ వరల్డ్‌లో రూపొందుతున్న ఈ సినిమాని యుగంధర్ ముని దర్శకత్వం వహిస్తున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర షూటింగ్ శరవేగంగా జరుపుకుంటోంది. ఇందులో ఆది సాయి కుమార్ జియో సైంటిస్ట్‌గా కనిపించనున్నారు. సూర్య 45వ చిత్రంలో భాగమైన శ్వాసిక ఈ సినిమాలో కీలక పాత్ర పోషిస్తోంది. రవివర్మ, మీసాల లక్ష్మణ్, మధునందన్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు. త్వరలో ఈ సినిమా రిలీజ్ డేట్ ను ప్రకటించనున్నారు.

# నా కోసం వాళ్లెవరూ థియేటర్లకు రారు: పూజా హెగ్డే

**ఇన్స్టాలో తనకు 27 మిలియన్ల ఫాలోయర్లు ఉన్నారన్న పూజా హెగ్డే**
**ఫాలోయర్లు ఉన్నంత మాత్రాన వాళ్లంతా థియేటర్లకు రారని వ్యాఖ్య**
**ప్రస్తుతం టాలీవుడ్ లో అవకాశాలు లేని పూజ**

కన్నడ భామ పూజా హెగ్డేకు తెలుగులో అవకాశాలు రాకపోయినా బాలీవుడ్ లో ఛాన్స్ లు వస్తున్నాయి. టాలీవుడ్ లో అతి తక్కువ సమయంలోనే స్టార్ స్టేటస్ అందుకున్న ఈ బుట్టబొమ్మ... ఆ తర్వాత అంతే వేగంగా పడిపోయింది. ప్రస్తుతం బాలీవుడ్ లో రెండు చిత్రాల్లో నటిస్తోంది. తాజాగా సోషల్ మీడియాలో తనను ఫాలో అయ్యే వారి గురించి పూజా హెగ్డే ఆసక్తిర వ్యాఖ్యలు చేసింది. ఇన్స్టాగ్రామ్ లో తనకు 27 మిలియన్ల మంది ఫాలోయర్లు ఉన్నారని... అయితే, వారంతా తన సినిమాలు చూసేందుకు థియేటర్లకు రారని పూజా హెగ్డే వ్యాఖ్యానించింది. చాలా మంది సూపర్ స్టార్లకు 5 మిలియన్ల కంటే తక్కువ మంది ఫాలోయర్లు ఉంటారని... కానీ, వారి సినిమాలకు కోట్ల మంది వస్తుంటారని తెలిపింది. కాబట్టి ఫాలోయర్లు ఉన్నంత మాత్రాన వాళ్లంతా మన కోసం థియేటర్లకు వస్తారని కాదని చెప్పింది.



# చూడ ముచ్చటగా అందాల రాశి

'ఊహలు గుసగుసలాడే' సినిమాతో తెలుగు సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్‌గా గుర్తింపు దక్కించుకున్న ముద్దుగుమ్మ రాశి ఖన్నా. అంతకు ముందు తెలుగులో మనం, హిందీలో మద్రాస్ కేఫ్ సినిమాల్లో నటించింది. ఆ రెండు సినిమాలు పెద్దగా గుర్తింపు తెచ్చి పెట్టలేదు. కానీ 'ఊహలు గుసగుసలాడే' సినిమాతో నటిగా విమర్శకుల ప్రశంసలు దక్కించుకోవడంతో పాటు, కమర్షియల్ బ్రేక్‌ను సొంతం చేసుకుంది. దాంతో ఈ అమ్మడు తెలుగు సినిమా ఇండస్ట్రీలో హీరోయిన్‌గా బిజీ అయింది. అందమైన ఈ అమ్మడికి టాలీవుడ్‌లో యంగ్ హీరోలకు జోడీగా వరుస సినిమాలు చేసే అవకాశం దక్కింది. అంతే కాకుండా టైర్ 2 హీరోలకు మోస్ట్ వాంటెడ్‌గా మారింది. ఒకానొక సమయంలో కాస్త బరువు ఎక్కువగా ఉన్న రాశి ఖన్నా సౌత్ ఇండస్ట్రీలో సక్సెస్‌ల కోసం, ఆఫర్ల కోసం సన్నబడింది. సహజ పద్దతిలో వర్కౌట్స్ చేస్తూ బరువు తగ్గింది. బరువు తగ్గి, సన్నగా నాజూకుగా కనిపించడం ద్వారా టాలీవుడ్‌లో మరిన్ని సినిమాలను ఈ అమ్మడు సొంతం చేసుకుంది. రాశి ఖన్నా ఈ మధ్య కాలంలో తెలుగు సినిమాల కంటే హిందీ, తమిళ్ సినిమాల్లో నటిస్తోంది. ప్రస్తుతం తెలుగు కదా అనే ఒకే ఒక సినిమాలో నటిస్తోంది. ఆ సినిమాపై చాలా ఆశలు పెట్టుకుని ఎదురు చూస్తుంది. హిందీలో ఈ అమ్మడు సినిమాలు చేసినా పెద్దగా ప్రయోజనం ఉండటం లేదు. తెలుగులో ఈమె దక్కించుకున్న విజయాలను మరే భాషలోనూ దక్కించుకోలేక పోయింది. ఇన్‌స్టాగ్రామ్‌లో 12 మిలియన్‌ల ఫాలోవర్స్‌ను కలిగి ఉన్న రాశి ఖన్నా రెగ్యులర్‌గా అందమైన ఫోటోలను షేర్ చేస్తూ ఉంటుంది. తాజాగా మరోసారి తన క్యూట్ అందమైన ఫోటోను షేర్ చేసింది. చీర కట్టులో, పాపట బిల్ల పెట్టుకుని, సింపుల్ హెయిర్ స్టైల్‌తో, చేతికి గాజులు ధరించి పద్దతైన అమ్మాయిగా రాశి ఖన్నా లుక్‌తో మెస్మరైజ్ చేసింది. వావ్ అంటూ ప్రతి ఒక్కరూ ఆశ్చర్యపోయే విధంగా స్టిల్ ఇచ్చింది. అలా సైడ్‌కి చూస్తూ ఉన్న రాశి ఖన్నాను నెటిజన్స్ తెగ లైక్ చేస్తున్నారు. రాశి ఖన్నా షేర్ చేసిన కొన్ని గంటల్లోనే లక్షకు పైగా లైక్స్‌ను దక్కించుకుంది. ఈమె అందంకు ఎంతో మంది లవ్ ఈమోజీలు షేర్ చేస్తూ తమ అభిమానం పంచుకున్నారు. తెలుగులో ఈమె ఊహలు గుసగుసలాడే సినిమా తర్వాత జోరు, జిల్, శివం, బెంగాల్ టైగర్, సుప్రీమ్, హైపర్, జై లవకుశ, ఆక్సీజన్, టచ్ చేసి చూడు ఇలా వరుసగా పెద్ద సినిమాల్లో నటించడం ద్వారా పాపులారిటీని సొంతం చేసుకుంది. పలు సినిమాలు సూపర్ హిట్ కాగా కొన్ని సినిమాలు యావరేజ్ టాక్‌ను సొంతం చేసుకున్నాయి. కానీ ఈమె స్టార్ హీరోకు జోడీగా జై లవకుశలో తప్ప మరే సినిమాలో నటించే అవకాశాన్ని దక్కించుకోలేక పోయింది. నటిగా ప్రస్తుతం బిజీగా ఉన్నప్పటికీ ఇంకాస్త జోరు పెంచాల్సిన అవసరం ఉందనే అభిప్రాయంను చాలా మంది వ్యక్తం చేస్తున్నారు. ఇంత అందంగా ఉన్న రాశి ఖన్నాకు తెలుగులో మరిన్ని ఆఫర్లు రావాలని అభిమానులు కోరుకుంటున్నారు.



TELUGU RASTRAM . Printed, Published and Owned by A.RAJASEKHAR. Printed at Ajay Sri Printers, D.No. 4/151, Aithabathulavari centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P Published at D.No. 4-151, Aithabathulavari Centre, S.Yanam, Uppalaguptam Mandal, Dr B.R. ambedkar konaseema Dist, A.P. Editor: A.RAJASEKHAR, . RNI NO. APTEL/2016/66202, email: telugurastram2016@gmail.com, Phone No. 8074368339